ఎప్పటికైనా సొంతింటికి వెళ్లాల్సిందే...




PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

42శాతం రిజర్వేషన్లతో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 364 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శనివారం 27 డిసెంబర్ 2025


# ఆళ్లగడ్డ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

కారును ఢీకొన్న ట్రావెల్ బస్సు

ప్రమాదంలో నలుగురు హైదరాబాదీల మృతి

ప్రమాదంపై మంత్రి జనార్దన్ రెడ్డి ఆరా




# ఢిల్లీ కాలుష్యంపై సుప్రీం చీఫ్ జస్టిస్ ఆందోళన

- పర్యావరణవేత్తలే పరిష్కారం కనుగొనాలి




# సాహస బాలలకు బాల పురస్కార్ అవార్డులు

అవార్డులను అందచేసిన రాష్ట్రపతి ముర్ము



**న్యూఢిల్లీ,డిసెంబర్ 26(పిసీడబ్ల్యూ న్యూస్):** న్యూఢిల్లీ వేదికగా 'ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్' కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఢిల్లీలో నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చిన్నారులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ పురస్కారాలు ధైర్య సాహసాలు, కళలు, సంస్కృతి, పర్యావరణం, ఇన్నోవేషన్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, క్రీడలు అనే ఆరు విభాగాల్లో సృజనాత్మకత చూపించిన వారికి అందించారు. అవార్డు గెలుచుకున్న పిల్లలు, వారి తల్లిదండ్రులకు మిగతా2లో...

# ప్రపంచ చరిత్రలోనే ఒక మైలురాయి..

## కనీవినీ ఎరుగని రీతిలో సమ్మక్క సారలమ్మ మహా జాతర

శాశ్వతంగా 200 ఏళ్ళు నిలిచేలా గద్దెల పునర్నిర్మాణం

మేడారం అభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి..

ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలకు పెద్దపీట..

ప్రతి నిర్మాణంలో సంస్కృతికి ప్రతిబింబించేలా చర్యలు..

సమ్మక్క సారలమ్మ పూజారుల సంఘం ఆమోదంతోనే ముందుకెళ్తున్నాం..

పనులు చెక్కుచెదరకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నాం..

30 ఏళ్ల నాటి కోయల తాళపత్ర గ్రంథాల్లోని విశేషాలకు శిల్ప రూపం..

అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సీతక్క

**ములుగు,డిసెంబర్ 26(పిసీడబ్ల్యూ న్యూస్):** ప్రపంచ చరిత్రలోనే సమ్మక్క సారలమ్మ మహా జాతర నిర్మాణ పనులు ఒక మైలు రాయిగా నిలిచిపోతాయనీ ,నిర్మాణ పనులు 200 ఏళ్లపాటు చెక్కుచెదరకుండా ఉండేలా చేపడుతున్నామని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ ,పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అనసూయ పేర్కొన్నారు. 4 వేల టన్నుల గ్రానైట్ పై ఆదివాసీ చరిత్ర సంస్కృతి తెలియజేసే 7,000 బొమ్మలతో సమ్మక్క సారలమ్మ నిర్మాణం పనులు వేగవంతంగా సాగుతున్నాయని స్పష్టం చేశారు. శుక్రవారం ములుగు జిల్లా మేడారంలో సమ్మక్క సారలమ్మ పునర్ నిర్మాణం పనులు పరిశీలించేందుకు హైదరాబాదు నుంచి మీడియా ప్రతినిధుల బృందం వచ్చింది. సమ్మక్క సారలమ్మ చరిత్ర ,పునర్నిర్మాణ నిర్మాణ పనులు ఆదివాసీల మూలాలు జాతర చరిత్రను మీడియా బృందానికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతరను ఈసారి కొత్త రూపుతో.. వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు.. వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు జరిగే జాతరకు తెలంగాణతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి కోటి మందికి పైగా భక్తులు తరలి వస్తారని అంచనా వేస్తున్నామని పేర్కొన్నారు. ఈసారి ఎప్పుడూ కల్పించే తాత్కాలిక సౌకర్యాలతోపాటు శాశ్వత నిర్మాణాలపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని ఎన్నడూ లేనివిధంగా రూ.251 కోట్లతో మేడారం అభివృద్ధికి చర్యలు మిగతా2లో...



# ప్రభుత్వంపై కెసిఆర్ సమరశంఖం

- నిధులు, నీళ్లు, నియామకాలపై మరోమారు జంగ్
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో భారీ బహిరంగ సభలు
- పాలమూరు-రంగారెడ్డికి అన్యాయంపై నిలదీసే యత్నం
- మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల ముఖ్య నేతలతో సమీక్ష



**గజ్వేల్,డిసెంబర్ 26(పిసీడబ్ల్యూ న్యూస్):** పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం విషయంలో తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్ రావు సమరశంఖం పూరించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ ఆశించిన ఫలితాలను సాధించలేకపోయిన నేపథ్యంలో, మళ్ళీ 'నీళ్లు-నిధులు-నియామకాలు' అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలని కేసీఆర్ కృతనిశ్చయంతో ఉన్నారు. సిఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లా నుంచే సమరం పూరించాలని చూస్తున్నట్లుగా తెలుస్తోంది. శుక్రవారం ఎర్రవల్లిలోని తన నివాసంలో మిగతా2లో...



# మన్మోహన్ సింగ్‌కు సిఎం రేవంత్ నివాళి

**హైదరాబాద్,డిసెంబర్ 26(పిసీడబ్ల్యూ న్యూస్):** మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మొదటి వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి ఘనంగా నివాళి అర్పించారు. మన్మోహన్ దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. జూబ్లీ హిల్స్ నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి సిఎం తదితరులు నివాళులు అర్పించారు. సీఎం సలహాదారు, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డిలు ఉన్నారు.

# మా అయ్య మొగోడు.. తెలంగాణ తెచ్చిన మొనగాడు

మా అయ్య పేరు బరాబర్ చెప్పకుంటా

రేవంత్ రెడ్డి చిట్టినాయుడు కాదు.. భీమవరం బుల్లోడు

దమ్ముంటే ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ నేర్చుకో

ఢిల్లీకి సంచులు మోసి పదవి కాపాడుకోవడం కాదు

ఇచ్చిన హామీలను అమలు చేసి చూపాలి

బిఆర్ఎస్‌లో ఉంటే ఆరికెపూడి ఎక్కడికి పోయినట్లు

సిఎం రేవంత్‌కు కెటిఆర్ సవాల్



**హైదరాబాద్,డిసెంబర్ 26(పిసీడబ్ల్యూ న్యూస్):** కేసీఆర్ ఒక్క ప్రెస్‌మీట్‌కు సీఎం రేవంత్ రెడ్డికి ముచ్చెమటలు పట్టాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇక కేసీఆర్ అసెంబ్లీకి వస్తే రేవంత్ రెడ్డి గుండె ఆగి చస్తాడని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లోని శేరిలింగంపల్లి నియోజకవర్గం అల్విన్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు దోసల అనిల్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. తెలంగాణ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కేటీఆర్ ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మిగతా2లో...

# రాజకీయ ముసుగులో రౌడీయిజం సహించం

రప్పారప్పా అంటూ జంతుబలులు..రక్తాభిషేకాలా

ఇలాంటి దుర్మార్గాలను సహించబోం

జిల్లా పోలీస్ కార్యాలయం ప్రారంభంలో చంద్రబాబు



**తిరుపతి,డిసెంబర్ 26(పిసీడబ్ల్యూ న్యూస్):** హత్య చేసే వారికి పోస్ట్‌మార్టం తప్పదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గట్టిగా హెచ్చరిక ఇచ్చారు. శుక్రవారం నాడు జిల్లా పోలీస్ కార్యాలయాన్ని సీఎం ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాజకీయ ముసుగులో చేసే నేరాలు అంగీకరించేది లేదన్నారు. పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైసీపీ హయాంలో మళ్ళీ రౌడీయిజం పెరిగిందని... అదే సరైనదని ఇంకా వాళ్ళు నమ్ముతున్నారని మండిపడ్డారు. రప్పా రప్పా... అని పోస్టర్‌లు వేసి బెదిరిస్తున్నారని ఫైర్ అయ్యారు. జంతువులను బలి ఇచ్చి, ఆ రక్తంతో పోస్టర్‌పై రక్తాభిషేకం చేయడం చూశానని.. ఇష్టారాజ్యంగా చేస్తే, ఎవరినీ వదిలి పెట్టను అంటూ హెచ్చరించారు. మిగతా2లో...

# కట్టుకున్న వాడే కాలయముడయ్యాడు

ప్రేమించి పెళ్లి చేసుకున్నా.. నిత్యం అనుమానమే

పెట్రోల్ పోసి భార్యకు నిప్పటించిన దుర్మార్గుడు



**హైదరాబాద్,డిసెంబర్ 26(పిసీడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్ నగరంలోని నల్లకుంటలో దారుణం జరిగింది. ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను అనుమానంతో ఓ కిరాతకుడు దారుణంగా హత్య చేశాడు. అది కూడా పిల్లల ముందే ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. భార్యపై విచక్షణారహితంగా దాడి చేయడమే కాకుండా ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. దీంతో తీవ్రంగా గాయపడిన మహిళ అక్కడిక్కడే మృతి చెందింది. అడ్డువెళ్లిన కూతురును కూడా మంటల్లోకి తోయగా ఆమె తృటిలో తప్పించుకుంది. ఈ ఘటన స్థానికంగా సంచలనం రేపింది. నల్గొండ జిల్లా హుజురాబాద్‌కు చెందిన దంపతులు వెంకటేశ్, త్రివేణి నల్లకుంటలో నివాసం ఉంటున్నారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న వీరికి ఓ కూతురు, కుమారుడు ఉన్నారు. అయితే ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను వెంకటేశ్ తరచూ అనుమానిస్తుండే వాడు. మిగతా2లో...

# ప్రపంచ చరిత్రలోనే ఒక మైలురాయి..

(మొదటి పేజీ తరువాయి)

తీసుకుంటున్నదని చెప్పారు. ఇందులో ప్రధానంగా వనదేవతల గద్దెల విస్తరణ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందనీ ఈ పనులకే రూ.101 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. పునరుద్ధరణ పనులు చేపట్టే సమయంలో గిరిజన పూజారులతో అనేకసార్లు సమావేశాలు నిర్వహించి పూజారుల సంఘం అభిప్రాయం తీసుకుని పూజారులను ఒప్పించడం జరిగిందని, ఒకే లైన్లో వన దేవతలు ఉండడం వలన భక్తులు దర్శనాలు చేసుకోవడానికి సులువుగా ఉంటుందని పేర్కొన్నారు. పూర్వకాలంలో గిరిజనులకు పసుపుతో ఎంతో బంధం ఉందని, శాస్త్రీయంగా పసుపుతో పలు వ్యాధులను నయం చేసుకునే అవకాశం ఉందని దీనిని వాడకం చేయడం వలన పూర్వం లో ఆదివాసులు ఎలాంటి వ్యాధుల బారిన పడిన పసుపును వాడుకున్నారని తెలిపారు. సమ్మక్క తల్లి గోత్రం బండారి గోత్రమని, తమ ఆదివాసీల సాంప్రదాయం ప్రకారం ప్రతి పనిని కుడి నుండి ఎడమవైపు నడుస్తుందని, నవగ్రహాలు సైతం కుడి నుండి ఎడమవైపే తిరుగుతున్నాయని వివరించారు. స్వస్తిక్ ఏర్పాటు చేసే విషయంలో సైతం పకృతి సిద్ధాంతాన్ని ఆచరించామని పేర్కొన్నారు. జాతరకు వచ్చే భక్తులు ఒకే వరుస క్రమంలో సులభతరంగా దర్శనం చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. జాతర కూడా ఎటువంటి ఇబ్బంది లేకుండా జరుపుతామని మంత్రి తెలిపారు. చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో ఈసారి సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహిస్తున్నామని భక్తులందరూ విజయవంతనికి కృషి చేయాలని సహకరించాలని కోరారు. ఆదివాసిల సంస్కృతి సాంప్రదాయాలకు పెద్దపీటవేస్తూ ప్రతి నిర్మాణం చేపడుతున్నామని సంస్కృతి ప్రతిబింబించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఆదివాసి పూజార్ల సంఘం ప్రతినిధుల ఆమోదంతోనే పునర్నిర్మాణ పనులు చేపట్టామని వివరించారు. వనదేవతల పూజల్లో విశిష్టత కలిగిన బండారి, మర్రి, వెదురు, బూరుగ, వేప, ఇప్ప, కస్తు వంటి 12 రకాల చెట్లు, 140 రకాల ఆయుర్వేద మొక్కలు నాటనున్నామని పేర్కొన్నారు. మేడారం ఆలయంలో పునర్నిర్మాణ పనులు వేగవంతానికి మంత్రుల బృందం ప్రతిరోజు సమీక్ష నిర్వహిస్తున్నది. పనులను పరిశీలిస్తూ అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్నది. పనుల్లో పూర్తి నాణ్యత పాటించేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. అధికారుల పురమయిస్తూ పనులు వేగవంతానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ నుంచి ప్రతి రోజు పనుల వేగవంతం పై అడిగి తెలుసుకుంటున్నారు. ప్రస్తుతం పనులు తుది దశలో ఉన్నాయి. త్వరలో అన్ని పనులు పూర్తీ అవుతాయి. మంత్రుల బృందాన్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అధికారులకు ఆదేశాలిస్తూ ముఖ్య మంత్రి ముందుకు సాగుతున్నారు. ఈసారి సమ్మక్క సారలమ్మ జాతరను బ్రహ్మాండంగా విజయవంతం చేసేందుకు ముఖ్య మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. మంత్రుల బృందం ప్రతిరోజు పనులను పర్యవేక్షిస్తూ వేగవంతం చేస్తున్నది. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్.పి. సుధీర్ రామ్ నాథ్ కేకన్, ఈ ఓ వీరస్వామి, పూజారుల సంఘం అధ్యక్షులు జగ్గారావు, స్థపతి శివనాజిరెడ్డి, మైపథి అరుణ్ కుమార్, పూజారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎప్పటికైనా సొంతింటికి వెళ్లాల్సిందే...

**ఢిల్లీ నాయకత్వం పిలుపుకోసం ఎదురు చూస్తున్నా**

**గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్**

**హైదరాబాద్,డిసెంబర్ 26(పిసీడబ్ల్యూ న్యూస్):**ఎమ్మెల్యే రాజాసింగ్ మళ్లీ వార్తల్లోకి వచ్చారు. ఎప్పికైనా సొంతింటికి వెళ్లక తప్పదని చెప్పారు. ఒక కుటుంబంలో నలుగురు అన్నదమ్ములు ఉండి, ఒక అన్నయ్య గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోతే.. ఏదో ఒక రోజు అతను ఇంటికి తిరిగి రావాల్సి ఉంటుందన్నారు. అలాగే తాను కూడా ఈ రోజు కాకపోయినా రేపైనా తన ఇంటికి తిరిగి వెళ్లాల్సి ఉంటుందని చెప్పారు. అయితే ఆ శుభ సమయం ఎప్పుడు వస్తుందో చెప్పలేనంటూ దాటవేశారు. తాను బీజేపీకినిజమైన సైనికుడిని అని తెలిపారు. ఢిల్లీ లేదా రాష్ట్ర నాయకులు తనను పిలిచిన రోజున తిరిగి పార్టీలోకి వస్తానని తేల్చి చెప్పారు. ఇంతకు ముందు కూడా తాను ఇదే అభ్యర్థన చేశానని.. ఇప్పుడు కూడా అదే అభ్యర్థన చేస్తున్నానని చెప్పారు. అసెంబ్లీలో స్వేచ్ఛ కల్పించాలని, ప్రతి ఎమ్మెల్యే, ప్రతి ఎంపీకి వారి నియోజకవర్గంలో స్వేచ్ఛ ఇవ్వాలని.. అప్పుడే బీజేపీ భవిష్యత్తులో అధికారంలోకి రాగలదని రాజాసింగ్ అన్నారు. ఈరోజు కాకపోయినా రేపైనా తనకు ఢిల్లీ పెద్దల నుండి లేదా రాష్ట్ర పెద్దల నుంచి పిలుపు వస్తుందని ఖచ్చితంగా తెలుసని చెప్పారు. వారి నుంచి ఫోన్ వస్తే.. తాను ఒకటే ఒక రిక్వెస్ట్ చేస్తానని అన్నారు. తమకు పార్టీ పెద్ద నాయకులు నుంచి స్వేచ్ఛ ఇవ్వండి అని కోరతానని చెప్పారు. అలా స్వేచ్ఛ ఇచ్చిన తర్వాత.. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలతో తాము ఏ విధంగా యుద్ధం చేస్తామో అంతా చూస్తారని రాజాసింగ్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే రాజాసింగ్ కొంతకాలం క్రితం బీజేపీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆయన ఏ పార్టీలో చేరకుండా ఒంటరిగానే ఉన్నారు. అయితే ఇటీవల ఆయన తిరిగి మళ్లీ బీజేపీలో చేరతారంటూ ఊహాగానాలు వస్తున్నాయి. ఈ విషయమై ఆయన..పార్టీ అగ్రనేతలతో చేసిన చర్చలు సఫలమైనట్లు కూడా తెలుస్తోంది. నెల రోజుల్లో ఆయన కాషాయ కండువా కప్పుకోవచ్చనే వార్తలు వస్తున్నాయి. రాజాసింగ్ వ్యాఖ్యలు సంచలనం కలిగిస్తున్నాయి.



# సాహస బాలలకు బాల పురస్కార్ అవార్డులు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రపతి అభినందనలు తెలిపారు. వారి సాహసాలు, విజ్ఞానం దేశానికి గర్వకారణం ఆమె ప్రశంసించారు. వయసుకు మించి ధైర్యసాహసాలు, ప్రతిభను ప్రదర్శించే చిన్నారులకు 'వీర్ బాల్ దివస్' సందర్భంగా ఏటా పురస్కారాలు అందిస్తారు. ఈ ఏడాది రాష్ట్రపతి భవన్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా బిహార్ చిన్నోడు వైభవ్ సూర్యవంశీ సహా పలువురు చిన్నారులు 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్'ను అందుకున్నారు. పురస్కార గ్రహీతల్లో ఒక్కొక్కరిదీ ఒక్కో కథ. వీరిలో వ్యోమప్రియ ప్రదర్శించిన సాహసం, శ్వాన్ సింగ్ ఉదారత పలువురి హృదయాలను కదిలించింది.కరెంట్ షాక్ నుంచి ఓ బాలుడిని కాపాడబోయి ప్రాణాలు కోల్పోయిన 8 ఏళ్ల చిన్నారి వ్యోమ ప్రియ తరఫున ఆమె తల్లి అర్చనా శివరామకృష్ణన్ రాష్ట్రపతి నుంచి పురస్కారం స్వీకరించారు. ఈ సందర్భంగా కుమార్తెను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. 'నా కుమార్తె తరఫున ఈ అవార్డు తీసుకుంటున్నా. అప్పుడు మా అమ్మాయికి ఎనిమిదేళ్లు. మా అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో ఉన్న పిల్లల పార్క్‌లో మిగతా చిన్నారులతో కలిసి ఆడుకుంటోంది. అక్కడ అండర్‌గ్రౌండ్ కేబుల్‌పై ఏర్పాటు చేసిన స్లైడ్‌పై ఆడుకుంటున్న ఆరేళ్ల పిల్లాడు అకస్మాత్తుగా పడిపోయాడు. ఆ చిన్నారిని కాపాడదామని వెళ్లిన నా కూతురుకు కరెంట్ షాక్ తగిలింది. ఆ ఘటనలో మా ప్రియతో పాటు ఆ బాలుడు కూడా ప్రాణాలు కోల్పోయాడు. కేబుల్ దెబ్బతిని ఉండటంతో స్లైడ్‌కు షాక్ రావడమే అందుకు కారణమైంది. అంత చిన్న వయసులోనే ధైర్యం ప్రదర్శించిన నా బిడ్డ ఇప్పుడు నేరుగా వచ్చి ఈ అవార్డు తీసుకొని ఉంటే ఎంతో సంతోషించేవాళ్లం అంటూ అర్చనా ఉద్వేగభరితంగా చెప్పారు. 2024 మేలో తమిళనాడులోని కొయంబత్తూరులో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది.'ఆపరేషన్ సిందూర్ సమయంలో ఓ పదేళ్ల బాలుడు మన సైనికులకు బాసటగా నిలిచాడు. అడగకముందే వారికి మంచినీరు, పాలు, టీ, లస్సీ.. వంటివి అందిస్తూ తనవంతు సాయం చేశాడు. అతడే శ్వాన్ సింగ్. పంజాబ్‌లోని ఫిరోజ్‌పుర్ జిల్లాకు చెందిన ఆ బాలుడి ధైర్యసాహసాలు, ఉత్సాహానికి ప్రశంసించిన సైన్యం అతడి చదువుకయ్యే ఖర్చులు పూర్తిగా భరించేందుకు ముందుకొచ్చింది. ఈ క్రమంలో తాజాగా శ్వాన్ సింగ్‌ను ఇప్పుడు బాలల పురస్కారం వరించింది. ఈ అవార్డును తాను కలలో కూడా ఊహించలేదని చిన్నారి సంతోషం వ్యక్తంచేశాడు. ఏటా డిసెంబర్ 26న వీర్ బాల్ దివస్ నిర్వహిస్తారు.

# మా అయ్య మొగోడు.. తెలంగాణ తెచ్చిన మొనగాడు

(మొదటి పేజీ తరువాయి)

కేటీఆర్ మాట్లాడుతూ.. మా అయ్య మొగోడు.. తెలంగాణ తెచ్చిన మొనగాడు అని కేటీఆర్ అన్నారు. మా అయ్య పేరు బరాబర్ చెప్పుకుంటానని స్పష్టం చేశారు. నీ లెక్క సంచులు మోసుకుంటే నీ పిల్లలు చెప్పుకోరు అని విమర్శించారు. రేవంత్ రెడ్డిని కొడంగల్‌లో ఎమ్మెల్యేగా గెలవకుండా చేసే బాధ్యత మాది అని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి భాషను చూస్తే పిల్లలు నేర్చుకునే పరిస్థితి ఉందని అన్నారు. నేను గుంటూరులో చదువుకుంటే నీకేం బాధరా అని ప్రశ్నించారు. నేను హిందీ, ఉర్దూ, ఇంగ్లీష్ భాష నేర్చుకున్నా.... నువ్వు కూడా నేర్చుకో అని అన్నారు. నేను గుంటూరులో ఇంటర్ చదువుకున్నా.. నీ అల్లుడు ఆంధ్రోడే కదా అని ప్రశ్నించారు. ఇక చిట్టినాయుడు కాదు.. భీమవరం బుల్లోడు అని ఎద్దేవా చేశారు. పాలమూరు ? రంగారెడ్డి డీపీఆర్‌ను వెనక్కి పంపితే ఏం చేస్తున్నావని కేసీఆర్ అడిగారని తెలిపారు. 10 శాతం పనులు పూర్తి చేసి సాగునీరు ఇవ్వాలని అడిగారని పేర్కొన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా తేల్చాలని అడిగారు.. అందులో తప్పేముందని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు అమలు చేయమంటే రేవంత్ రెడ్డికి కోపమొస్తుందని అన్నారు. ఎనుముల రేవంత్ రెడ్డి కాదు.. ఎగవేతల రేవంత్ రెడ్డి అని కేటీఆర్ విమర్శించారు. ఎన్నికలకు ముందు కల్యాణలక్ష్మి కింద ఆడబిడ్డల పెళ్లికి రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తానని సోనియాగాంధీ మీద రేవంత్ రెడ్డి ఒట్టువేశాడని తెలిపారు. మహిళలకు రూ.2500 ఇస్తానని ప్రియాంక గాంధీ మీద ఒట్టు వేశాడని గుర్తుచేశారు. ఇవన్నీ ఎగవేసి.. ఇప్పుడు కోటి మంది మహిళలకు కోటీశ్వర్లను చేస్తానంటున్నాడని మండిపడ్డారు. కేసీఆర్‌ను మళ్లీ అధికారంలోకి రాకుండా చేస్తానని రేవంత్ రెడ్డి శపథం చేస్తున్నాడని తెలిపారు. జనవరి 1 నుంచి మహిళలకు రూ.2500 ఇస్తానని శపథం చేయాలని రేవంత్ రెడ్డికి సూచించారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ బీఆర్ఎస్‌లోనే ఉంటే.. అనిల్ రెడ్డి పార్టీలో చేరినప్పుడు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. దమ్ముంటే రాజీనామా చేసి ఉప ఎన్నికకు రావాలని అరికెపూడి గాంధీకి సవాలు విసిరారు. ఎమ్మెల్యే పేరులో గాంధీ మాత్రమే ఉందని.. కానీ చేసేది భూకబ్జాలు అని విమర్శించారు. అల్విన్ కాలనీలో సమావేశం పెడతామంటే ఫంక్షన్ హాలు యజమాని బెదిరించాడని తెలిపారు. హైదరాబాద్ చరిత్రలో ఎవరితో సంబంధం లేకుండా బీఆర్ఎస్‌కు జీహెచ్ఎంసీ కార్పొరేషన్‌ను అప్పజెప్పారని కేటీఆర్ గుర్తుచేశారు. హైదరాబాద్‌లోని 23 ఎమ్మెల్యేలను గెలిపించారని అన్నారు. హైదరాబాద్ వాసులందరికీ ఎప్పటికీ రుణపడి ఉంటామన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పి బీఆర్ఎస్‌కు పట్టం కట్టారని తెలిపారు. 40శాతం సర్పంచ్‌లను బీఆర్ఎస్‌కు ఇచ్చారని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సరైన నాయకులకు అవకాశమిస్తామని కేటీఆర్ తెలిపారు. స్థానిక నాయకులంతా కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వంతో కొట్లాడి పనులు చేయిస్తామని స్పష్టం చేశారు. కార్పొరేటర్లు గెలిస్తే కార్పొరేషన్ నిధులతో అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. హైదరాబాద్ కార్పొరేషన్‌ను మూడు ముక్కలు చేస్తారంటా అని కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్‌ను ఎన్ని ముక్కలు చేసినా ఓట్లు వేసేది ప్రజలే అని అన్నారు. మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కొడుకు భూకబ్జాలు చేస్తున్నాడని కేటీఆర్ అన్నారు. మంత్రి కొడుకుపై కేసు పెట్టిన అబీబుల్లాఖాన్‌ను బదిలీ చేశారని తెలిపారు. గన్ పెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారని మంత్రి కొండా సురేఖ కూతురే స్వయంగా చెప్పిందని గుర్తుచేశారు.

# రాజకీయ ముసుగులో రౌడీయిజం సహించం

(మొదటి పేజీ తరువాయి)

సోషల్ మీడియాలో కొందరు చెలరేగిపోతున్నారని.. దీన్ని అంగీకరించమని స్పష్టం చేశారు. అది ఆమోదయోగ్యం కాదన్నారు. కూటమి వాళ్ళు చేయరని.. తప్పు చేసిన వారు తప్పించుకోలేరని అన్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా అంతా అప్రమత్తంగా ఉండాలని.. టీటీడీ, పోలీసులు సమన్వయంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. తిరుపతిని నేరాలు లేని సిటీగా చూడాలని... తిరుపతి ఒక ఫ్యూచర్ సిటీ అంటూ వెల్లడించారు. ఇక్కడ నోరు పారేసుకున్న, ఇష్టారాజ్యంగా చేసినా వదిలిపెట్టనని వార్న్ చేశారు. ఇక్కడే పుట్టిన తనకు, ఇక్కడి అన్ని విషయాలు తెలుసన్నారు. తిరుపతి వేంకటేశ్వరస్వామి ఉండే ప్రాంతమని... ఈ ప్రాంత పవిత్రత కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు.

# ఆళ్లగడ్డ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

**నంద్యాల,డిసెంబర్ 26(పిసీడబ్ల్యూ న్యూస్):** ఆళ్లగడ్డ మండలం నల్లగట్లలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు, ట్రావెల్స్ బస్సు ఢీకొని నలుగురు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. ఈ ప్రమాదంలో వేగంగా దూసుకెళ్లిన కారు.. డివైడర్‌ను దాటి ఎదురుగా వస్తున్న సీజీఆర్ ట్రావెల్స్ బస్సును ఢీకొట్టింది. దీంతో ఈ ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. మృతులంతా హైదరాబాద్ వాసులుగా తెలుస్తోంది. మృతిచెందిన వారిని గుండురావు (60), శ్రావణ్ (22), నరసింహ, బన్నీగా గుర్తించారు. తోటి ప్రయాణికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బాధితులను రక్షించి స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తరలిస్తున్నారు. మరోవైపు ఘటనా స్థలాన్ని డీఎస్పీ ప్రమోద్ కుమార్ సైతం పరిశీలించారు. ఈ ప్రమాదంపై మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నలుగురు మృతిచెందడం అత్యంత దురదృష్టకరం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదంపై జిల్లా అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి.. వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు తక్షణమే వైద్య సహాయం అందించాలని ఆదేశించారు. ఘటనా స్థలానికి వెళ్లి అధికారులు వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని ఆజ్ఞాపించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తరచూ రోడ్డు ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోతున్న క్రమంలో ప్రయాణికులు, వాహనదారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రి జనార్దన్ రెడ్డి సూచించారు.

# ఢిల్లీ కాలుష్యంపై సుప్రీం చీఫ్ జస్టిస్ ఆందోళన

**న్యూఢిల్లీ,డిసెంబర్ 26(పిసీడబ్ల్యూ న్యూస్):**దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకూ పెరుగుతోంది. శుక్రవారం ఉదయం కూడా గాలి నాణ్యత సూచిక ప్రమాదకర స్థాయిలో నమోదైంది. అనేక ప్రాంతాల్లో ఏక్యూఐ లెవెల్స్ 400కిపైగా నమోదయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో రాజధాని నగరంలో తీవ్ర కాలుష్యంపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కాలుష్య సంక్షోభానికి పర్యావరణ నిపుణులు సమర్థవంతమైన పరిష్కారాన్ని కొనుగొంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఓ న్యూస్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ.. 'ఢిల్లీని పీడిస్తున్న వాయు కాలుష్య సమస్యను నివారించడానికి స్వల్పకాలిక ఉపశమనం కలిగించే విధానాల కంటే.. దీర్ఘకాలిక పరిష్కారం కోసం చర్యలు అవసరం. ప్రజారోగ్యానికి పెద్ద సవాలుగా మారుతున్న ఈ వాయు కాలుష్య సమస్యకు నిపుణులు పరిష్కారం కనుగొంటారని నాకు నమ్మకం ఉందని అన్నారు. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రకారం.. శుక్రవారం ఉదయం రాజధాని నగరంలో గాలి నాణ్యత గణనీయంగా క్షీణించింది. ఉదయం 8 గంటల ప్రాంతంలో నగరంలో ఓవరాల్ ఏక్యూఐ లెవెల్స్ 305గా నమోదైంది. అత్యధికంగా ఆనంద్ విహార్ ప్రాంతంలో గాలి నాణ్యత సూచిక 390గా నమోదైంది. బవానాలో 379, నరేలా ప్రాంతంలో 356, ఆర్కే పురంలో 320గా ఏక్యూఐ నమోదైంది. నగరంలోని మరికొన్ని ప్రాంతాల్లో గాలి నాణ్యత మెరుగ్గా నమోదైంది. ఔ÷ూఎ÷ ద్వారకలో 253, అరబిందో మార్గ్ (258), మందిర్ మార్గ్ (234), ఎఉఎ విమానాశ్రయం ÷3 (239)గా గాలి నాణ్యత నమోదైంది.

# కట్టుకున్న వాడే కాలయముడయ్యాడు

(మొదటి పేజీ తరువాయి)

ఈ విషయంపై భార్యను తీవ్రంగా వేధించేవాడు. వారి మధ్య తరచూ గొడవలు జరిగేవి. తాజాగా భర్త వేధింపులు తాళలేక భార్య త్రివేణి పుట్టింటికి వెళ్లింది. దీంతో అక్కడికి వెళ్లిన వెంకటేశ్.. తాను మారానని, ఇకపై బాగా చూసుకుంటానంటూ నమ్మించి త్రివేణిని హైదరాబాద్‌కు తీసుకొచ్చాడు. అయితే తీసుకొచ్చిన కొద్దురోజులకే ఆమెను అతి దారుణంగా చంపేశాడు. ఎప్పటిలాగే అనుమానంతో భార్యతో గొడవకు దిగి విచక్షణ మరిచి ఆమెపై దాడి చేశాడు. అంతటితో ఆగకుండా త్రివేణిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు.అడ్డుకున్న కూతురినీ మంటల్లో తోసేసిన వెంకటేశ్ అక్కడి నుంచి పరారయ్యాడు. అరుపులు, కేకలు విన్న స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేసి ఇద్దరినీ స్థానిక ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే త్రివేణి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కూతురు స్వల్పగాయాలతో బయటపడింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలించారు. కేవలం 12 గంటల్లోనే వెంకటేశ్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. . బాగా చూసుకుంటానని నమ్మించి తమ కుమార్తెను ఇలా దారుణంగా చంపేశాడంటూ త్రివేణి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. అనుమానంతో భార్యను హత్య చేసి భర్త జైలు పాలవడంతో.. ఇద్దరు చిన్నారులు అనాథలుగా మిగిలిపోయారు. తల్లి కోసం చిన్నారులు విలపిస్తున్న తీరు అక్కడి వారిని తీవ్రంగా కలిచివేసింది.

# ప్రభుత్వంపై కెసిఆర్ సమరశంఖం

(మొదటి పేజీ తరువాయి)

ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల ముఖ్య నేతలతో ఆయన సుదీర్ఘంగా సమావేశమై పార్టీ భవిష్యత్తు కార్యాచరణను ఖరారు చేశారు. ప్రధానంగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం తక్కువ నీటి కేటాయింపు లకు అంగీకరించడం ద్వారా దక్షిణ తెలంగాణ రైతాంగానికి తీరని అన్యాయం చేస్తోందని కేసీఆర్ మండిపడ్డారు.ఈ అన్యాయాన్ని ఎండగట్టడమే కాకుండా, క్షేత్రస్థాయిలో రైతులను చైతన్యపరచడానికి మూడు ఉమ్మడి జిల్లాల్లో మూడు భారీ బహిరంగ సభలను నిర్వహించాలని ఈ భేటీలో నిర్ణయించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని పరిగిలో ఒక సభను, నల్గొండ జిల్లాలోని దేవరకొండ లేదా కొండమల్లేపల్లిలో రెండో సభను, మహబూబ్‌నగర్ జిల్లాలో అత్యంత భారీ స్థాయిలో మూడో సభను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.రాబోయే అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే ఈ బహిరంగ సభలను ప్రారంభించాలని కేసీఆర్ నేతలకు దిశానిర్దేశర చేశారు. సంక్రాంతి పండుగ కంటే ముందే ఒక సభను నిర్వహించి, పండుగ తర్వాత మిగిలిన రెండు సభలను పూర్తి చేయాలా? లేక మూడు సభలను సంక్రాంతి తర్వాతే వరుసగా నిర్వహిం చాలా అనే అంశంపై తేదీలను త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు. ముఖ్యంగా ఈ మూడు సభలకు కేసీఆర్ స్వయంగా హాజరై ప్రసంగించబోతుండటంతో అటు పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. గత పదేళ్ల తమ పాలనలో చేసిన అభివృద్ధిని, ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పోలుస్తూ ప్రజల్లోకి వెళ్లాలని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో వెనకడుగు వేయకూడదని ఆయన నేతలకు స్పష్టం చేశారు. ఈ సభల ద్వారా దక్షిణ తెలంగాణలో బీఆర్ఎస్ తన పట్టును తిరిగి నిరూపించుకోవాలని చూస్తోంది.

# 42శాతం రిజర్వేషన్లతో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు

**● సిఎం రేవంత్‌కు ఆర్. కృష్ణయ్య లేఖ**



**హైదరాబాద్,డిసెంబర్ 26(పిసీడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను బీసీలకు 42శాతం రిజర్వేషన్లతోనే నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డికి రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య లేఖ రాశారు. ఇందుకు సంబంధించిన వివరాలను బీసీ భవన్‌లో ఆయన వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు చేసిన కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42శాతం రిజర్వేషన్లను స్థానిక సంస్థలలో అమలు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. ఇటీవల జరిగిన సర్పంచి ఎన్నికల్లో ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేసిందన్నారు. రాబోయే ఎంపీటీసీ జడ్పీటీసీ ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు చేసిన తర్వాత నిర్వహించాలని కోరారు. అలా చేయకుండా ఎన్నికలకు వెళితే జాతీయ బీసీ సంక్షేమ సంఘం తరఫున పెద్దఎత్తున బీసీ ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 డిసి ప్రకారం స్థానిక సంస్థలలోని బీసీ రిజర్వేషన్ పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. బీసీలకు ఇచ్చిన హామీని సీఎం అమలు చేసి మాట నిలుపుకోవాలని, లేనిపక్షంలో బీసీల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు.

# ఎమ్మెల్యే రేవూరి చేస్తున్న అభివృద్ధే విజయానికి సోపానాలు...

**- యూత్ కాంగ్రెస్ ముందుండి ఎంపీటీసీ జడ్పిటిసి లను గెలిపించుకోవాలి**

**- పరకాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మాదాసి శ్రీధర్**



**పరకాల,డిసెంబర్ 26(పిసీడబ్ల్యూ న్యూస్):** పరకాల నియోజకవర్గంలో టిఆర్ఎస్ నేతలు అవినీతి అక్రమాలు దాడులు దౌర్జన్యాలు తో విసుగెత్తిన ప్రజలు కాంగ్రెస్ ప్రజా పాలన ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి చేస్తున్న అభివ ృద్ధిని చూసి కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థులకు పట్టం కట్టారని పరకాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మాదాసి శ్రీధర్ అన్నారు. శుక్రవారం ఆత్మకూరు మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు తనుగుల సందీప్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన యూత్ కాంగ్రెస్ సమావే శంలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మాదాసి శ్రీధర్ మాట్లాడుతూ టిఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు కార్యకర్తలకు నాయకులకే అందాయని విమర్శించారు. పరకాలలోని ప్రభుత్వ భూములను కబ్జాలు చేసుకొని పట్టాలు చేయించు కున్నారని యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో వారి అవినీతిని ప్రజలకు తెలియజేయాలని మాదాసి శ్రీధర్ పిలుపునిచ్చారు . జరగబోయే ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు అఖండ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత యూత్ కాంగ్రెస్ పై ఉందని ఆయన అన్నారు. పరకాల నియోజక వర్గములో ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పార్టీలకు అతీతంగా అర్హులైన నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న విషయం ప్రతి గడపగడపకు తెలియజేయాలి అన్నారు. గత పది సంవత్సరాలు ప్రజలు నరకయాతన అనుభవించారని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో స్వేఛగా ఆనందంగా జీవిస్తున్నారన్నారు. గతంలో దోచుకున్న అవినీతి డబ్బును విచ్చలవిడిగా ఓట్ల కోసం ఖర్చు చేస్తున్న విషయం ప్రజలకు తెలియజేస్తే బీఆర్ఎస్ కు డిపాజిట్ రాకుండా పోతుందన్నారు. నీతి నిజాయితీపరులను ఎన్నికల్లో గెలిపించుకుంటే మీకు అందుబాటులో ఉండి సేవలందిస్తున్న విషయం ప్రజలకు తెలియజేయవలసిన బాధ్యత యూత్ కాంగ్రెస్ నాయకుల, కార్యకర్తల పై ఉందన్నారు. అనంతరం యూత్ కాంగ్రెస్ లో గెలిచిన సర్పంచ్ వార్డు సభ్యులకు సన్మానం చేశారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిలు సర్పంచ్ గుండాల క్రాంతి,మౌలా,మంద శ్యామ్,అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ మేకల అనిల్ యాదవ్,ఎండీ ఉస్మాన్, అచ్చ వర్ష,ప్రధాన కార్యదర్శి శ్రీరామ్, కొక్కరకొండ రాజు,నడికూడ మండల అధ్యక్షులు అప్పం కుమారస్వామి,సిలువేరు రాజు,పిట్టల రాజ్ కుమార్ ప్రవీణ్,శ్రీకాంత్,ఖాసీం, కరీం,శివ వివిధ మండలాల కమిటీ సభ్యులు యూత్ నాయకులు పాల్గొన్నారు.

# మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం







**సాయిబాబా గుడిలో ప్రత్యేక పూజలు**

**చిన్నారిని ఆశీర్వదించిన రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్**



**వేంసూరు, డిసెంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండల పరిధిలో మర్లపాడు గ్రామంలో శ్రీ సాయిబాబా గుడి వార్షికోత్సవం సందర్భంగా బాబా శుక్రవారం కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అదే గ్రామంనకు చెందిన ముచ్చనపల్లి రత్నాకర్ జ్ఞాపకార్థంగా సిఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా మినరల్ వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు. కందుకూరు గ్రామ కాంగ్రెస్ నాయకులు గొర్ల వెంకటప్ప రెడ్డి మనవడు బారసాల కార్యక్రమంలో పాల్గొని చిన్నారిని అదేవిధంగా సత్తుపల్లి పట్టణంలో హనుమాన్ నగర్ నందు ప్రముఖ వ్యాపారవేత్త వందనపు సత్యనారాయణ నివాసము నందు శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం కార్యక్రమం పాల్గొని ప్రత్యేకమైన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మట్టా దయానంద్ ను శాలువలతో పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వేంసూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసర చంద్రశేఖర్ రెడ్డి, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పుచ్చకాయల సోమిరెడ్డి, వేంసూరు మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంక్షేమ వసతి గృహాల్లో 15 రోజుల్లోపు అవసరమైన మైనర్ రిపేర్లను చేయించాలి

**వసతిగృహాల నిర్వహణ సక్రమంగా లేకపోతే అధికారులు,సిబ్బందిపై చర్యలు తప్పవు: జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**



**కర్నూలు డిసెంబర్ 26(పిసీడబ్ల్యూ న్యూస్):** జిల్లాలో ఉన్న అన్ని సంక్షేమ వసతి గృహాల్లో 15 రోజుల్లోపు మైనర్ రిపేర్లను చేయించి, అవసరమైన వసతులను కల్పించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ వసతి గృహాలలో కల్పించాల్సిన సౌకర్యాలు, నిర్వహణ పై అన్ని సంక్షేమ శాఖల వార్డెన్లతో, అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని సంక్షేమ వసతిగృహాల్లో టాయిలెట్ లు, ఫ్యాన్లు, లైటింగ్, డోర్ లకు మెష్, ఆర్వో ప్లాంట్ల మరమ్మతులు లాంటివి ఏవైనా 15 రోజుల్లోపు చేయించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.మైనర్ రిపేర్లకు కొంత నిధులు ఇవ్వడం జరిగిందని, వాటితో ఈ మరమ్మతులు చేయించాలని కలెక్టర్ ఆదేశించారు.మేజర్ రిపేర్లకు పై నుండి కానీ సీఎస్ఆర్ నిధులు కానీ తెప్పించి చేయిస్తామని కలెక్టర్ తెలిపారు. హాస్టళ్లలో ముళ్ళ పొదల తొలగింపు, డ్రైనేజ్ పనులు, అవసరమైన చోట వీధి దీపాలు వేయించాలని కలెక్టర్ డిపివో ను ఆదేశించారు. టాయిలెట్స్ కు నీటి కనెక్షన్, సెప్టిక్ ట్యాంక్ కనెక్షన్, సోక్ పిట్స్ పనులు చేయించాలని ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ ఈ ని ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న హాస్టళ్లకు అవసరమైన చోట స్వచ్ఛ భారత్ కింద టాయిలెట్ లను నిర్మించాలని అడిషనల్ కమిషనర్ ను ఆదేశించారు.రెండు రోజుల కిందట కోసిగి మండల కేంద్రంలోని వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ సమీకృత బాలుర వసతి గృహమును తనిఖీ చేశానని, అక్కడ నిర్వహణ సరిగా లేదని, వసతి గృహాల నిర్వహణ సరిగా లేకపోతే సంబంధిత అధికారులు, సిబ్బందిపై కఠినమైన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. అక్కడ స్క్రాప్ మెటీరియల్ మొత్తం డిస్పోస్ చేయకుండా అలాగే పెట్టారని,అన్ని సంక్షేమ వసతి గృహాలలో స్క్రాప్ మెటీరియల్ ను డిస్పోస్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.అదే విధంగా టాయిలెట్ లు, ఫ్లోరింగ్ మొత్తం యాసిడ్ తో క్లీన్ చేయించాలని కలెక్టర్ ఆదేశించారు.పిల్లలకు మెనూ ప్రకారం భోజనం పెట్టకపోతే కఠినమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అధికారులను హెచ్చరించారు.స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలన్నారు.కొన్ని వసతి గృహాలలో పిల్లలను పాలు, పెరుగు తీసుకొని రమ్మని బయటికి పంపిస్తున్నారని ఫిర్యాదులు తన దృష్టికి వస్తున్నాయని, ఇలాంటి ఫిర్యాదులు రాకూడదని,వస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. హాస్టల్ భవనాలు మంచి స్థితిలో లేకపోతే వెంటనే ఖాళీ చేసి, వేరే భవనంలోకి మార్చాలని కలెక్టర్ సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు.వంట వారు, ఇతర సిబ్బంది సరిగా లేకుంటే వెంటనే తీసి వేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు.వసతి గృహాల్లో విద్యార్థులకు ట్యూషన్ చెప్పేందుకు మంచివిద్యా వాలంటీర్ లు ఉండాలని కలెక్టర్ సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు.గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 10 వ తరగతి లో ఉత్తీర్ణతా శాతం ఎక్కువ రావాలని కలెక్టర్ సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు.కొత్త వసతి గృహాల ఏర్పాటు కొరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని కలెక్టర్ సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు.

# ఆర్టిసిని ఆదరించండి

- **ప్రైవేటు వాహనంలో ఇబ్బంది పడకండి**
- **ఆర్టీసీ బస్సులోనే ప్రయాణించండి మేడారం గద్దెల పక్కనే దిగండి**



**తొర్రూరు ప్రతినిధి, డిసెంబర్ 26(పిసీడబ్ల్యూ న్యూస్):** ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి దర్శనం ఇచ్చే వనదేవతల జాతర రానే వచ్చింది. భక్తులకు కొంగుబంగారంలో దర్శించుకునేభాగ్యానికి తెలంగాణ టిజిఎస్ ఆర్టిసి బస్ సౌకర్యాలను తొర్రూరు డిపో నుండి డిపో మేనేజర్ పద్మావతి ఆదివారం ఉదయం ఏడు గంటల నుండి మేడారంలోని సమ్మక్క సారమ్మ జాతర గద్దెల వరకు ఆర్టీసీ బస్సులు వెళ్తాయి అని తెలిపారు.ఈ బస్సు సౌకర్యం ఎంతో ఉపయోగపడుతుంది. మీ కోరిక మేరకు నిలువెత్తు బంగారాన్ని మోసుకు వెళ్లాలంటే ప్రైవేటు వాహనాల్లో దూర ప్రాంతాలలో .ఏదైనా తక్కువ ధరలకే వస్తున్నాయని ప్రైవేటు వాహనాలలో వెళ్తే కిలోమీటర్ల దూరంలో నిలిపివేసి భక్తులను నడిచి వెళ్ళమని సలహా ఇస్తారు. ఉచిత సలహాలు వినకండి ఆర్టీసీలో ప్రయాణం చేసి ఆనందంగా వెళ్లి తిరిగి రండి. భక్తుల రద్దీనిబట్టి మరిన్ని బస్సు సౌకర్యాలను కల్పించేందుకు తొర్రూర్ డిఎం బస్సుల తో రెడీగా ఉన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం బస్సుల సంఖ్యను పెంచుతారు అని అన్నారు.

# చెర్లపాలెంలో ఘనంగా నిర్వహించిన క్రిస్మస్ వేడుకలు

- **ఏసు క్రైస్తవులకే కాదు ప్రతి ఒక్కరికి దేవుడు: ధర్మారపు డేవిడ్ రాజ్**



**తొర్రూరు ప్రతినిధి, డిసెంబర్ 26(పిసీడబ్ల్యూ న్యూస్):**క్రైస్తవులకు ఎంతో ముఖ్యమైన పండుగ క్రిస్టమస్. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని చర్లపాలెం గ్రామపంచాయతీ చర్చిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలను జరుపుకున్నారు. చిన్న పెద్ద తేడా లేకుండా వారికి నచ్చిన రీతిలో ఇష్టమైన పాటలను పాడుకుంటూ ఎంతో సరదాగా ఈ పండుగను నిర్వహించుకోవడం జరిగిందని డాక్టర్ డేవిడ్ రాజ్ అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నూతనంగా గ్రామపంచాయతీ సర్పంచ్ గాఎన్నుకోబడిన ధర్మారపు మహేందర్ హాజరయ్యారు.క్రీస్తు జననం ప్రపంచానికే శాంతి ఏసుక్రీస్తు కేవలం క్రైస్తవులకే కాదు ఏసుక్రీస్తు అందరికీ ప్రభువు అని అన్నారు. క్రీస్తు తన ప్రేమను శాంతిని ప్రపంచానికి పంచి నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించాలని సందేశాన్ని ఇచ్చారు. చర్చిలో సంఘస్తులు క్రిస్మస్ పాటలు పాడి దేవుని మహిమ పరిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ ధర్మవరం మహేందర్, ఉపసర్పంచ్ జనగా రవీందర్ రెడ్డి,వార్డ్ మెంబర్ ధర్మారం యాకయ్య కాంగ్రెస్ మండల అధ్యక్షులు చిటిమల మహేష్ మాజీ ఉపసర్పంచ్ ధర్మారపు వెంకటయ్య మహిమ పరిచినారు.

# డయల్ యువర్ డిఎం కార్యక్రమంలో పాల్గొనండి

- **మీ అమూల్యమైన సలహాలు అందజేయండి**





**తొర్రూరు ప్రతినిధి, డిసెంబర్ 26(పిసీడబ్ల్యూ న్యూస్):**మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల కేంద్రంలోని టిజీఎస్ ఆర్టీసీ బస్ డిపో మేనేజర్ పద్మావతి 27వ తేదీన డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.శనివారం 11 గంటల నుండి 12 గంటల వరకు డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తొర్రూర్ డిపో మేనేజర్ వి పద్మావతి ఒక ప్రకటనలో తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తొర్రూరు డిపో పరిధిలోని ఆయారూట్లలోని బస్సుల గురించి మరియు బస్టాండ్ లోని మౌలిక సదుపాయాల గురించి ఫోన్ ద్వారా తెలియజేయగలరు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని డిపో అభివృద్ధికి మీ యొక్క విలువైన సలహాలు సూచనలు ఇచ్చి డిపో అభివృద్ధికి సహకరించగలరని తెలియజేశారు మీరు చేయవలసిన ఫోన్ నెంబర్9959226053 డిపో మేనేజర్ తోరూర్.

# ఒక పలక ఒక బలపం... నోట్ బుక్స్ వితరణ




**కల్లూరు, డిసెంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మున్సిపాలిటీ పరిధిలో స్థానిక శాంతినగర్ కు చెందిన కొత్తపల్లి వంశీ, వెంకటేశ్వర్లు క్రిస్మస్ పర్వదినం సందర్భంగా స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు వరక రామారావు కు శుక్రవారం నోట్ బుక్స్ అందజేశారు. స్ఫూర్తి ఫౌండేషన్ వారు ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల కొరకు నోటుబుక్స్ సేకరణ ఒక పలక ఒక బలపం ఒక పుస్తకం కార్యక్రమానికి స్పందించి విద్యార్థులకు అందించమని 20 నోటుబుక్స్ స్ఫూర్తి ఫౌండేషన్ ఆఫీస్ నందు అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొత్తపల్లి వంశీ, వెంకటేశ్వర్లు దాతృత్వానికి స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ వుయ్యూరి శ్రీవ్యాల్, వాలంటీర్లు కృతజ్ఞతలు తెలిపారు

## కరీంనగర్ భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐకి వందేళ్లు..






**కరీంనగర్ టౌన్ డిసెంబర్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) వందేళ్ల ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ కేక్ కట్ చేసి సంబరాలకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ, హైదరాబాద్ నిజాం సంస్థానంలో రాచరిక పాలనకు ముగింపు పలికి ప్రజాస్వామ్య పాలనను ప్రజలకు అందించడంలో సీపీఐ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. కార్మికులు, రైతులు, పేదల హక్కుల కోసం నిరంతరం పోరాడిన పార్టీగా సీపీఐ చరిత్రలో నిలిచిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గౌడ సంఘం ఆధర్వంలో ఘన సన్మానం



**రామడుగు, డిసెంబర్ 26(పిసిడబ్ల్యూ న్యూస్) :** రామడుగు మండలంలోని గోపాల్ రావుపేట్ లో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన నుతన పాలకవర్గ సభ్యులకు గౌడ సంఘం పెద్దలు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కాగా వరుసగా రెండుసార్లు వార్డ్ సభ్యురాలిగా గెలుపొందిన నేరెళ్ల కవిత రాజు గౌడ్ ను అభినందిచడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గౌడ సంఘం అధ్యక్షుడు ఏగోలపు కొమురయ్య గౌడ్, ఉపాధ్యక్షుడు బుర్ర గంగయ్య గౌడ్, సభ్యులు తాల్లపెల్లి మల్లయ్య గౌడ్, కాసారపు బుచ్చి రాములు గౌడ్, నేరెళ్ల తిరుపతి గౌడ్, ముంజ శేఖర్ గౌడ్, ఏపూరి పరుశురాం గౌడ్, పొన్నం లింగస్వామి గౌడ్ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రెండు రోజులు పర్యటన



**సత్తుపల్లి, డిసెంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం జిల్లా లో సత్తుపల్లి, దమ్మపేట మండలాలలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు రెండు రోజులు పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా శనివారం ఉదయం 10:30 గంటలకు దమ్మపేట మండల పరిధిలోని పూసుకుంట గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి తుమ్మల పాల్గొనున్నారు. అదేవిధంగా ఆదివారం ఉదయం 10 గంటలకు సత్తుపల్లి మండల పరిధిలోని గంగారం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల తో పాటు ఆయా నియోజకవర్గాల శాసనసభ్యులు కూడా పాల్గొనున్నారు. వీటితో పాటు మంత్రి తుమ్మల పలు బాధిత కుటుంబాలను పరామర్శించనున్నట్లు తెలిపారు.

## కాంగ్రెస్‌లో చేరిన పచ్చునూరు సర్పంచ్...





**తిమ్మాపూర్, డిసెంబర్26(పీసీడబ్ల్యూ న్యూస్):** మానకొండూర్ మండలం పచ్చునూరు గ్రామ సర్పంచ్ పార్నంది కిషన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్ లో ఆయనకు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సర్పంచ్ కిషన్ తోపాటు వార్డు సభ్యులు తాళ్ల వెంకటేశ్, నెలవేణి సుశీల, కోమల్ల నరేష్ లు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ పచ్చునూరు గ్రామ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. గ్రామ అవసరాల మేరకు చేపట్టే అభివృద్ధి పనులకు అధిక నిధులు కేటాయిస్తానన్నారు. గ్రామాభివృద్ధికి సహాయ సహకారాలు అందజేస్తానని ఆయన హామీ ఇచ్చారు. పంచాయతీ నూతన పాలకవర్గం ప్రజల సమస్యల పరిష్కారానికి పాటుపడాలని, ముఖ్యంగా విద్యుత్,పారిశుద్ధ్యం,డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపర్చడం, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో పచ్చునూరు ఉప సర్పంచ్ మూడగాని అనిల్, వార్డు సభ్యులు పిట్టల సువర్ణ, పిట్టల మల్లేశం, దాసారం అనిత, పూసాల సతీష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, రామిడి శ్రీనివాస్ రెడ్డి,రొంటాల లక్ష్మారెడ్డి,బుర్ర శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత నట్టల నివారణ కార్యక్రమం



**హన్మకొండ, డిసెంబర్26(పీసీడబ్ల్యూ న్యూస్):** హసన్ పర్తి మండలం లోని భీమారం లో పశు సంవర్ధక శాఖ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన గొర్రెలు మరియు మేకలలో ఉచిత నట్టల నివారణ శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 55 వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రజిత యాదవ్ పాల్గొని గొర్రెలలో నట్టల మందులు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలాకాలం తర్వాత వచ్చిన గొర్రెలలో నట్టల నివారణ మందుల శిబిరాన్ని యాదవ సోదరులు సద్వినియోగం చేసుకొని నట్టల మందులు త్రాగించుకొని గొర్రెలను ఆరోగ్యంగా ఉంచుకొని లబ్ధి పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో హసన్ పర్తి పశు వైద్యాధికారి డాక్టర్ మాళవిక, మాట్లాడుతూ హసన్ పర్తి పశు వైద్యశాల పరిధిలోని గ్రామాల్లో ఏడు రోజుల పాటు ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని సుమారు 15 వేల గొర్రెలు మరియు మేకలలో ఉచితంగా నట్టల నివారణ మందులు టీం ల ద్వారా తాగిస్తున్నామని గొర్రె కాపర్లు ఈ నట్టల మందుల ను 3 నెలల కు ఒకసారి త్రాగించుకొని తదుపరి బలవర్ధకమైన లివర్ టానికులు త్రాగించుకొని సీజన్ వారీగా వచ్చే వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని గొర్రెల శాలలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చింత గట్టు పశుసంపద ఆధికారి బింగి సురేష్, జీవి వో శారద మరియు గొర్రె కాపర్ల సంఘం అధ్యక్షులు చింతల రమేష్, శేఖర్, బిక్షపతి, రాహుల్, మరియు పెద్దఎత్తున యాదవ సోదరులు పాల్గొన్నారు.

# కమ్యూనిజం అజేయం.. అజరామరం











● చరిత్రలో నిలిచిపోయేలా జనవరి 18న బహిరంగసభ ● జనవరి 1 నుంచి సభలు, సమావేశాలు, ర్యాలీలు ● సిపిఐ నేత బాగం: సిపిఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పతాకావిష్కరణ

**ఖమ్మం ప్రతినిధి, డిసెంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కమ్యూనిజం అజేయం.. అజరామరమని మరో వందేళ్ళు ప్రజల హృదిలో కమ్యూనిజం నిలిచి వుంటుందని సిపిఐ జాతీయ సమితిసభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ప్రజా పక్షాన సిపిఐ చేసిన పోరాటాలు, త్యాగాలు చిరస్మరణీయమన్నారు. భారత కమ్యూనిస్టుపార్టీ వందో ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిపిఐ పతాకాన్ని హేమంతరావు ఆవిష్కరించగా, పార్టీ కార్యాలయం గిరిప్రసాద్భవన్పై పార్టీ పతాకాన్ని సి.పి.ఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆవిష్కరించారు. అనంతరం గిరిప్రసాద్భవన్లో మందడపు రాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాగం హేమంతరావు మాట్లాడుతూ.. 1925 డిశంబర్ 26న కాన్పూర్లో ఆవిర్భవించిన సిపిఐ వందేళ్ళ సుదీర్ఘ ప్రస్తానంలో అనేక పోరాట విజయాలను సాధించిందన్నారు. ఆవిర్భావం నుంచి అనేక నిర్భందాలను ఎదుర్కొని ప్రజల పక్షాన నిలిచిందన్నారు. సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యలతో పాటు, రైతులు, యువజనులు, మహిళ, విద్యార్థి, వ్యవసాయకార్మిక సమస్యలపై చారిత్రిక పోరాటాలు చేసి అపూర్వ విజయాలను సాధించిందన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. భారత కమ్యూనిస్టుపార్టీ చరిత్రలో తెలంగాణ, రైతాంగ సాయుధపోరాటం, సువర్ణాక్షర లిఖితమని ఈ పోరాటంలో నాలుగున్నర వేలమంది అమరులైయ్యారని సాయుధ పోరాటం తెలంగాణ సమాజంపై తీవ్ర ప్రభావం చూపించిందని ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి జన జీవితంలో గొప్ప మార్పుతెచ్చిందన్నారు. వందేళ్ళ సుదీర్ఘ పోరాటాన్ని నేటి తరానికి తెలియజేయడంతో పాటు భవిష్యత్ పోరాటాలకు ప్రజలను కార్యోన్ముకులను చేసిందేకు 2026 జనవరి 18న ఖమ్మంలో చారిత్రక సభ నిర్వహిస్తున్నట్లు హేమంతరావు తెలిపారు. జనవరి 18 సాయంత్రం 4 గంటలకు ఖమ్మం డిగ్రీకళాశాల మైదానంలో లక్షలాది మందితో బహిరంగసభ నిర్వహించనున్నామని, ఈ సభకు తెలంగాణ రాష్ట్రంతో పాటు దక్షిణాది రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలి రానున్నారని హేమంతరావు తెలిపారు. కేరళ, కర్నాటక, తమిళనాడు, పాండ్చేరి రాష్ట్రాల నుంచి ప్రత్యేక రైలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సభకు 40 దేశాల నుంచి సౌహార్ధ సందేశం ఇచ్చేందుకు ప్రతినిధులు తరలిరానున్నారన్నారు. ఈ చారిత్రక సభను జయప్రదం చేసేందుకు జనవరి 1 నుంచి విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు.

**జాతాలు, జనరల్ బాడీ సమావేశాలు** జనవరి 18న జరిగే బహిరంగసభకు సంబంధించి జనవరి 3 తేదీ నుంచి 6వ తేదీ వరకు ప్రధాన గ్రామాలు, పార్టీ ప్రభావితగల ప్రాంతాలలో జనరల్బాడీ సమావేశాలు నిర్వహించనున్నట్లు హేమంతరావు తెలిపారు. జనవరి 3వ తేదీన శతవసంతాల ముగింపు వేడుకల సభ విజయవంతంలో భాగంగా వేంసూరు జాతా ప్రారంభమవుతుందని,3 నుంచి 7వ తేదీ వరకు ఐదు రోజులపాటు అన్ని మండలాలలో జాతా నిర్వహించడం జరుగుతుందన్నారు.జనవరి 9న జిల్లా వ్యాపితంగా అన్ని గ్రామాలలో ప్రభాతభేరి నిర్వహించనున్నామని 10వ తేదీన అన్ని మండల కేంద్రాలలో బెలూన్లు ఎగర వేయడం జరుగుతుందని, 13 నుంచి 16వ తేదీ వరకు మైక్ ప్రచారం నిర్వహించనున్నామన్నారు. ఖమ్మం నగరంలో వారం రోజులపాటు ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నామని హేమంతరావు తెలిపారు. ఈసభలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమీషన్ చైర్మెన్ మహ్మద్ మౌలానా, జిల్లా కార్యదర్శి దండిసురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఎస్.కె. జానిమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, అజ్మీర రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

**ప్రజలు మెచ్చేలా పల్లేపాలన : బాగం సిపిఐ సర్పంచ్లకు ఘన సన్మానం** ప్రజలు మెచ్చేలా వల్లెపాలన ఉండాలని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమనిసిపిఐ ప్రజా ప్రతినిధులు పనిచేయాలని సిపిఐ జాతీయ సమితిసభ్యులు భాగం హేమంతరావు కోరారు. సిపిఐ పక్షాన గెలిచిన గ్రామ పంచాయతీ సర్పంచ్లు, ఉప సర్పంచ్లను శుక్రవారం స్థానిక గిరిప్రసాద్భవన్లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ.. తన, పరభేదం లేకుండా అన్నివర్గాల ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. గ్రామాల అభివృద్ధితోపాటు, పల్లెలో ప్రశాంతతను కాపాడాలని గ్రామానికి కమ్యూనిస్టుపార్టీ మంచి పేరుతేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమీషన్ చైర్మెన్ మహ్మద్ మౌలానా, జిల్లా కార్యదర్శి దండిసురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, సిపిఐ రాష్ట్ర సమితిసభ్యులు, మండల కార్యదర్శులు ఆయా గ్రామాల పార్టీ నాయకులు హాజరయ్యారు.



# పీడిత వర్గాల విముక్తి కోసమే ఎర్రజెండా:వీరోచిత త్యాగాలతో నిండిన ఎర్రజెండానే పేద ప్రజలకు అండ...

**- సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్**




**గోదావరిఖని,డిసెంబర్26(పీసీడబ్ల్యూ న్యూస్):**గోదావరిఖని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో 100 సంవత్సరాల కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావము సందర్భంగా పార్టీ కార్యాలయంలో మాస్ లైన్ జెండాను ఆవిష్కరించడం జరిగింది.సీపీఐ ఎంఎల్, మాస్ లైన్ ప్రజాపంథా కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూలి భారతదేశంలో శ్రామిక, పీడిత వర్గాల విముక్తి కోసం, సోషలిజం స్థాపన లక్ష్యంతో ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 2025 డిసెంబర్ 26 నాటికి వంద సంవత్సరాల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటోంది. నూరేళ్ల కమ్యూనిస్టు చరిత్ర ఎన్నో వీరోచిత పోరాటాలతో, అలుపెరగని సైద్ధాంతిక పోరాటాలతో నిండి ఉంది.1925 డిసెంబర్ 26 నుండి 28 వరకు ఉత్తరప్రదేశ్లోని కాన్పూర్ లో జరిగిన మహాసభలో దాదాపు 500 మంది ప్రతినిధులు పాల్గొని భారత కమ్యూనిస్టు పార్టీని లాంఛనంగా స్థాపించారు. ఈ సభలో పార్టీ కేంద్ర కార్యాలయం బొంబాయిలో ఉండాలని నిర్ణ యించి, సింగార వేలును అధ్యక్షునిగా, ఆజాద్ సాహిని ఉపాధ్య క్షునిగా, ఎస్.వి. ఘాటే, జానకీ ప్రసాద్ బాగెర్ హాట్లను ప్రధాన కార్యదర్శులుగా ఎన్నుకొన్నారుచారిత్రక పోరాటాలనుండి బ్రిటిష్ సామ్రాజ్యవాదం దేశాన్ని విముక్తి చేయడం, ఉత్పత్తి సాధనాలు సమాజానికి చెందేలా కార్మిక, కర్షక రిపబ్లికన్ను స్థాపించడం పార్టీ ప్రధాన ఆశయంగా ప్రకటించింది. స్వాతంత్ర్యోద్యమంలో కమ్యూనిస్టులు అత్యంత క్రియాశీలక పాత్ర పోషించారు. పెషావర్, మీరట్ కుట్ర కేసుల వంటి కఠిన నిర్బంధాలనూ, బ్రిటిష్ వలసవాదుల నిషేధాన్ని ఎదుర్కొంటూనే ఉద్యమాన్ని నడిపారు. ముఖ్యంగా నిజాం నిరంకు శత్వం, భూస్వాములకు వ్యతిరేకంగా సాగిన 'తెలంగాణ సాయుధ పోరాటం', 'తెభాగా (బెంగాల్), 'వర్లీ' (మహారాష్ట్ర), 'పున్నప్ర-వాయలార్' (కేరళ) పోరాటాలు భారత చరిత్రలో చెరగని ముద్ర వేశాయి.1942 'క్విట్ ఇండియా' ఉద్యమం వంటి కొన్ని కీలక సందర్భాలలో తీసుకున్న నిర్ణయాలు ప్రజల వాంఛలకు భిన్నంగా ఉండటంతో పార్టీ కొంత నష్టాన్ని చవిచూసింది. 1950ల తర్వాత ప్రవేశించిన మితవాద, అతివాద ధోరణుల ఫలితంగా 1964లో పార్టీ చీలిపోయింది. ఆ తర్వాత 1967 నక్సల్బరీ పోరాటం దరిమిలా 1969లో చారు మజుందార్ నాయకత్వంలో సీపీఐ (ఎంఎల్) ఏర్ప డింది. అయితే, వర్గశత్రు నిర్మూలన వంటి అతివాద దుస్సాహసిక పద్ధతుల వల్ల విప్లవ శిబిరం అనేక గ్రూపులుగా విడిపోయి, సైద్ధాంతిక పిడివాదంలో చిక్కుకుపోయింది.నేటి భారతంలో పెట్టుబడిదారీ విధానం, గ్లోబల్ కార్పొరేట్ సామ్రాజ్యం కొత్త రూపాల్లో ప్రజలను దోపిడీ చేస్తున్నాయి. మతో న్మాద ఫాసిజం, కుల వివక్ష, ఆర్థిక అణచివేతల నుంచి ప్రజలను విముక్తి చేయడమే నేటి కమ్యూనిస్టుల ప్రథమ కర్తవ్యం.ఈ వందేళ్ళ కమ్యూనిస్టు ఉద్యమ అనుభవం- నక్సల్బరీ, శ్రీకాకుళ, గోదావరి లోయ, దండకారణ్య తదితర ఉద్యమాల అనుభవం మనకు త్యాగాల దారినే కాదు. ఏన్నెన్నో గుణపాఠాలను, వైఫల్యాల పార్శ్వాలను అందించింది. ఆ అనుభవంతో భారత దేశంలో బలమైన ఐక్య విప్లవ కమ్యూనిస్టు పార్టీని సరైన సైద్ధాంతిక, రాజకీయ పునాదుల మీద నిర్మించడమే అమరవీరులకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు.ఇంకా ఈ జెండావిష్కరణ కార్యక్రమంలో ఎక్లాస్పూర్ గ్రామ సర్పంచ్ జూపాక మమత,సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా కరీంనగర్ ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి గుజ్జుల సత్యనారాయణ రెడ్డి, జిల్లా నాయకులు, గుమ్మడి వెంకన్న ఈసంపల్లి రాజేందర్, గొల్లపల్లి చంద్రయ్య మార్త రాములు,ఆడెపు శంకర్, పుల్లూరి నాగభూషణం తూళ్ళ శంకర్ కలువల రాయమల్లు పెండ్యాల రమేష్, తీగుట్ల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ గోల్డ్ కప్ టోర్నమెంట్‌కి ఎంపికైన కాంపల్లి సూర్య ప్రకాష్





**తల్లాడ, డిసెంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :**మండల పరిధిలోని నారాయణపురం గ్రామానికి చెందిన కాంపల్లి సూర్య ప్రకాష్ తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టిసిఏ) వారు నిర్వహించె తెలంగాణ గోల్డ్ కప్ టోర్నమెంట్ కి ఖమ్మం జిల్లా జట్టు తరుపున ఎపింకయ్యాడు. వరంగల్ లో కాకతీయ యూనివర్సిటీ గ్రౌండ్ లో ఈ నెల 27, 28, 29 తేదీలలో జరిగే టోర్నమెంటులో ఆడనున్నాడు. జిల్లా జట్టుకు ఎంపిక అవ్వటం పట్ల నారాయణపురం గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చిన్ననాటి నుండి ఆటల్లో రాణిస్తూ అంచెలంచెలుగా ఎదిగి జిల్లా జట్టుకు ఎంపీ కావడం హర్సనీయమన్నారు. నారాయణపురం గ్రామస్తులతో పాటు తల్లాడ మండల నాయకులు అతనికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపి రాణించాలని ఆకాంక్షించారు.

# ఇంకెంత కాలం.. మీ నిర్లక్ష్యం..?

- **జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను కేటాయించలేని అసమర్థ ప్రభుత్వం**
- **ముగ్గురు మంత్రుల ఇలాఖాలోనే జర్నలిస్టులకు తీవ్ర అన్యాయం**
- **బిజెపి తెలంగాణ రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు**





**ఖమ్మం ప్రతినిధి, డిసెంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలోనే పెట్టిందని, అదేవిధంగా జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు కూడా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి తీరుతామని స్పష్టమైన హామీలు గుప్పించి మూడు సంవత్సరాలు అవుతున్న ఇంకా జర్నలిస్టులను మోసం చేస్తూనే ఉన్నారని, ఇంకెంతకాలం మీ నిర్లక్ష్యం అని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు విమర్శించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం క్యాబినెట్ ఆమోదముద్ర, ప్రత్యేక జీవో, సిసిఎల్ అనుమతితో ఖమ్మం జర్నలిస్టుల ఇండ్ల స్థలాలకోసం కేటాయించిన 23.02 ఎకరాల స్థలాన్ని అప్పగించేందుకు సిద్ధపడ్డ కలెక్టర్ ను కూడా ఆపిన అసమర్థ ప్రభుత్వం అని అన్నారు.జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల సాధన కోసం ఇకపై రాజీలేని పోరాటమే శరణ్యమని, మీ ఈ పోరాటంలో బీజేపీ సంపూర్ణ మద్దతు కొనసాగుతుందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు స్పష్టం చేశారు. టిడబ్ల్యూజేఎఫ్ (హెచ్2843) ఖమ్మం జిల్లా అధ్యక్షులు టి. సంతోష్ చక్రవర్తి, జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణలతో పాటు జిల్లా నాయకులు వారి స్వగృహంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలసి, ఖమ్మం జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకత్వానికి ఆయన అభినందనలు తెలియజేస్తూ, జర్నలిస్టుల సమస్యలను రాజకీయాలకు అతీతంగా చూడాల్సిన అవసరం ఉందని, ముఖ్యంగా ఇళ్ల స్థలాల అంశంలో కొనసాగుతున్న నిర్లక్ష్య వైఖరి తీవ్రమైన ఆవేదన కలిగిస్తోందని వ్యాఖ్యానించారు.ఖమ్మం జిల్లాలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులకు గత ప్రభుత్వ హయాంలో క్యాబినెట్ ఆమోదంతో, ప్రత్యేక జీవో 147 ద్వారా కేటాయించిన 23.02 ఎకరాల ప్రభుత్వ భూమిని ఈరోజు వరకు పంపిణీ చేయలేకపోవడం పాలకుల ఘోర వైఫల్యమే కాకుండా, జర్నలిస్టుల పట్ల చూపుతున్న స్పష్టమైన నిర్లక్ష్యానికి నిదర్శనమని దేవకి వాసుదేవరావు తీవ్రంగా విమర్శించారు. ఖమ్మం నుంచి ముగ్గురు మంత్రులు రాష్ట్ర కేబినెట్‌లో ఉన్నప్పటికీ, వారి ఇలాఖాలోనే రెండు దశాబ్దాల కాలంగా పోరాటం చేస్తున్న నాలుగో స్తంభానికి న్యాయం జరగకపోవడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. జీవోతో విధానపరమైన అనుమతి ఇచ్చి సంవత్సరాలు గడుస్తున్నా, ఒక్క జర్నలిస్టు పేరు మీద కూడా ఒక పట్టా కూడా జారీ కాలేదని ,ఈ విషయంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. 'జీవో ఉంది, భూమి ఉంది, అర్హత ఉంది. అయినా జర్నలిస్టులు రోడ్డుపైకి వచ్చి పోరాడాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది?' అని ఆయన నిలదీశారు. జర్నలిస్టుల భూమిని ఆక్రమించేందుకు ఎవరైనా కుట్ర పన్నారా? అనే అనుమానాన్ని కూడా ఆయన వ్యక్తం చేశారు. ఇలాంటిదే జరిగితే ఈ విషయాన్ని ఎండగడతామని హెచ్చరించారు.ఖమ్మం జర్నలిస్టుల భూమి పంపిణీ విషయంలో అధికారులు హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీ కేసులో వచ్చిన సుప్రీంకోర్టు తీర్పు ఖమ్మం జర్నలిస్టులకు వర్తించదని రెవిన్యూ అధికారులు, న్యాయ నిపుణులు స్పష్టం చేస్తున్నా ఎందుకు జర్నలిస్టులను మభ్యపెడుతున్నారని దేవకి వాసుదేవరావు ప్రశ్నించారు. సంబంధంలేని తీర్పును అడ్డు పెట్టుకుని ఖమ్మం జర్నలిస్టుల సంక్షేమ అంశాన్ని అడ్డు కోవడం న్యాయబద్ధం కాదని, కలెక్టర్ కు ఒక్కమాట చెబితే పనయ్యే జర్నలిస్టుల ఇళ్ల స్థలాల పంపిణీ పై మభ్యపెట్టడమేమిటని ఘాటుగా వ్యాఖ్యానించారు. జర్నలిస్టులు ప్రభుత్వానికి శత్రువులు కాదని, ప్రజల గొంతుకగా పనిచేసే బాధ్యతాయుత వర్గమని దేవకి వాసుదేవరావు స్పష్టం చేశారు. అలాంటి వర్గాన్ని గత ప్రభుత్వాలు, ప్రస్తుత ప్రభుత్వం కూడా ఒకేలా నిర్లక్ష్యం చేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతమని హెచ్చరించారు. జీవో ద్వారా కేటాయించిన 23.02 ఎకరాల భూమిని అర్హులైన ఖమ్మం జర్నలిస్టులకు వెంటనే అప్పగించేంతవరకు బీజేపీ మౌనంగా ఉండబోదని, అవసరమైతే జర్నలిస్టుల ఉద్యమాల్లో ప్రత్యక్షంగా పాల్గొని పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన తేల్చిచెప్పారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల పోరాటం వ్యక్తిగత సమస్య కాదని, ఇది వృత్తి గౌరవం, భద్రతకు సంబంధించిన మౌలిక హక్కుల ఉద్యమమని పేర్కొంటూ, మంత్రులు తక్షణమే స్పందించి తమ ఇలాఖాలోనే న్యాయం జరిగేలా నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టిడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కోశాధికారి అర్వపల్లి నాగేష్, టిబిజేపి జిల్లా అధ్యక్షుడు వందనపు సామ్రాట్ గుప్తా, జిల్లా నాయకులు ఎలుగోటి వెంకట్, కప్పల మధు, కందరబోయిన నాగకృష్ణ, షేక్ సోందుమియా, మామిడాల కిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ భేటీ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ఉద్యమానికి కొత్త ఉత్సాహాన్ని నింపిందని, భవిష్యత్తులో జర్నలిస్టుల హక్కుల సాధనకోసం సమిష్టిగా ఉద్యమాత్మకంగా ముందుకు సాగుతామని టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు టి. సంతోష్ చక్రవర్తి స్పష్టం చేశారు.

## గోపాలంకు మాజీ ఎమ్మెల్యే సండ్ర నివాళులు



**కల్లూరు, డిసెంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** మండల పరిధిలో యర్రబోయినపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు సింగిశాల ప్రసాద్ తండ్రి సింగిశాల గోపాలం భౌతికాయం ను దర్శించి బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. గోపాలం గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తన నివాస గృహం యర్రబోయినపల్లి గ్రామంలో శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సండ్ర కుటుంబ సభ్యులును పరామర్శించినారు. మృతునికి భార్య సావిత్రి, వీరికి 4 సంతానం ఉన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# గురు గోవింద్ సింగ్ కుమారుల వీరత్వానికి నివాళిగా వీర్ బాల్ దివస్...

**- వీర్ బాల్ దివస్ చరిత్ర ప్రాముఖ్యత భావితరాలకు స్ఫూర్తిదాయకం...**

**- భారతదేశంలో పిల్లల త్యాగాలను గౌరవించడానికి, అంకితం చేయబడిన మొదటి జాతీయ దినోత్సవం డిసెంబర్ 26,**

**- నగర కీర్తన సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి వ్యాఖ్యలు...**






**కరీంనగర్,డిసెంబర్26(పీసీడబ్ల్యూ న్యూస్):**పదవసిక్కుల గురువు గురు గోవింద్ సింగ్ జి యువకుమారుల అసాధారణ ధైర్యం, త్యాగాన్ని స్మరించుకుంటూ, వారి వీరత్వానికి నివాళిగా ప్రతి ఏటా డిసెంబర్ 26 న వీర్ బాల్ దివస్ ను నిర్వహించడం జరుగుతుందని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. భారత ప్రధాని నరేంద్ర మోది, బిజెపి రాష్ట్ర శాఖ పిలుపుమేరకు జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున వీర్ బాల్ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీర్ బాల్ దివస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ సర్దార్ బల్వీర్ సింగ్ బిజెపి శ్రేణులు కరీంనగర్ లోని టవర్ సర్కిల్ నుండి సిక్కువాడిలోని గురుద్వారా వరకు నగర కీర్తన పేరిట యాత్రను చేపట్టారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి నగర కీర్తన యాత్రను ప్రారంభించి మాట్లాడారు. గురు గోవింద్ సింగ్ జి కుటుంబం ఆనాడు మొఘల్ సామ్రాజ్యాన్ని దీటుగా ఎదుర్కొని నిలబడిందన్నారు. ముఖ్యంగా గురు గోవింద్ సింగ్ చిన్న కుమారులు సాహిబ్ జాదా జోరావర్ సింగ్( 9 సం.లు), సాహిబ్ జాదా ఫతేసింగ్(7 సం. లు ) లు అసాధారణ ధైర్య సాహసాలను ప్రదర్శించి , ధర్మరక్షణ, హైందవ ధర్మ రక్షణే ధ్యేయం కోసం నిలబడి మొఘల్ నవాబులను ఎదిరించారని తెలిపారు. అతి చిన్న వయసులోనే సింహాల్లా గర్జించి, మతం మారమని చెప్పిన మొఘల్ నవాబు వజీర్ ఖాన్ నుజోరావర్ సింగ్, ఫతే సింగ్ లు గడగడ లాడించారన్నారు. డిసెంబర్ 26న సజీవ సమాధి కాబడిన ఆ వీర బాలల త్యాగం ఎందరికో స్ఫూర్తి దయకమన్నారు.అభం శుభం తెలియని వయసులోనే ఆత్మాభిమానాన్ని చాటి దేశం కోసం, ధర్మం కోసం గోడల మధ్య బంధింపబడి, బలిదానమైన జోరావర్ సింగ్, ఫతే సింగ్ ల ధైర్య, శౌర్య సాహసాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గురు గోవింద్ సింగ్ జి కుమారుల వీరోచిత త్యాగాలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం గుర్తించి, 2022 లో ప్రధాని నరేంద్ర మోదీ వీర్ బాల్ దివస్ ను అధికారికంగా ప్రకటించారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. భారతదేశంలో పిల్లల త్యాగాలను గౌరవించడానికి, అంకితం చేయబడిన మొదటి జాతీయ దినోత్సవం డిసెంబర్ 26 అని తెలిపారు. గురు గోవింద్ సింగ్ జి కుమారుల వీరత్వం భావితరాలకు స్ఫూర్తిదాయకామన్నారు. వీర బాలుల ధైర్యం, విశ్వాసానికి గౌరవం తెస్తూ, వారి త్యాగాన్ని స్మరించుకుంటూ నేటి పిల్లల్లో ధైర్యం, నిబద్ధతను పెంపొందించడమే వీర్ బాల్ దివస్ ముఖ్య ఉద్దేశం అన్నారు. ఇట్టి కార్యక్రమంలో కరీంనగర్ గురుద్వారా అధ్యక్షులు సర్దార్ హర్మిందర్ సింగ్, కార్యదర్శి సర్దార్ యస్పాల్ సింగ్, కమిటీ సభ్యులు రవీందర్ పాల్ సింగ్, మంజిత్ సింగ్, జస్పాల్ సింగ్, రణధీర్ సింగ్, సురేందర్ పాల్ సింగ్, స్వరణ్ సింగ్, భూపేందర్ సింగ్ లతోపాటు బిజెపి మైనార్టీ మోర్చా రాష్ట్ర నాయకులు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ సర్దార్ బల్వీర్ సింగ్, బిజెపిజిల్లా ఉపాధ్యక్షులు కన్న కృష్ణ, సాయిని మల్లేశం, తాజా మాజీ కార్పొరేటర్లు కోలగని శ్రీనివాస్, దురిశెట్టి అనూప్, సతీష్, మీడియా కన్వీనర్ కటకం లోకేష్, జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర, నాయకులు నాంపల్లి శ్రీనివాస్, గుజ్జ శ్రీనివాస్, జోన్ అధ్యక్షులు అవదుర్తి శ్రీనివాస్, జాడి బాల్ రెడ్డి, పాదం శివరాజ్, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు సమీ పర్వేజ్, నాయకులు నరహరి లక్ష్మారెడ్డి, మాసం గణేష్, తోట అనిల్, సురేష్, పొన్నాల రాము, పోరెడ్డి శ్రీధర్,బెల్లం నరేందర్, కలికోట మోహన్ తదితరులు పాల్గొన్నారు.



# ఆరావళికి విజయోస్తు !

ఆరావళిపై సాగుతున్న అరాచకంపై ప్రజలు మేల్కొని ఉద్యమబాట పట్టడంతో కథ అడ్డం తిరిగింది. అంటే ప్రజా ఉద్యమాలకు బలం ఉందని తేలింది. ప్రజా ఉద్యమాలను న్యాయస్థానాలు సైతం అంగీకరిస్తున్నాయి. అందువల్ల సమస్యలపై ముఖ్యంగా పర్యావరణ సమస్యలపై పోరాటం చేయాల్సిందేనని ఆరావాళి మనకు హెచ్చరించింది. ఇది ఆరంభంగా తీసుకోవాలి. దేశంలో ఎక్కడిక్కడ ప్రజలు దేశ పర్యావరణ విధ్వంసంపై ఉద్యమించాలి. నదుల అనుసంధనం ద్వారా నీటి వృధాను అరికట్టేందుకు నడుం బిగించాలి. క్యాన్సర్ కారక పరిశ్రమలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి. అన్నింటికి మించి ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా పెద్ద ఉద్యమం అవసరం. ఇదంతా ఎందుకు చర్చించుకోవాలంటే ఆరావళిని కార్పోరేట్లకు ధారాదత్తం చేయాలన్న ప్రభుత్వ కుట్రలకు వ్యతిరేకంగా ఉద్యమించడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. సుప్రీం ఆదేశాలతో అక్కడ తవ్వకాలకు స్వస్తి పలికింది. సహజసిద్ధంగా, భారత్‌కు రక్షణ గోడలా ఉన్న ఆరావళి పర్వతాల్లో తవ్వకాలకు వ్యతిరేకంగా పర్యావరణవేత్తలు, ప్రజలు, మేధావులు పెద్ద ఎత్తున ఉద్యమించారు. సోషల్ మీడియాలో ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ప్రభుత్వ అనుకూల మీడియా సైతం వ్యతిరేకించడం విశేషం. ప్రజాందోళనలు అంతకంతకూ మృగ్యమైపోతున్న ప్రస్తుత కాలంలో ఉదయ్‌పూర్ నుంచి ఢిల్లీ దాకా ఉద్యమం రాజుకోవడం, పర్యావరణవేత్తలు, సామాన్య ప్రజలు అనే తేడా లేకుండా తమను కంటికి రెప్పలా కాపాడుతున్న ఆరావళిని కాపాడేందుకు నడుం బిగించారు. కార్పొరేట్ లాభాలు తాత్కాలికమైనవి. పర్యావరణ నష్టాలు శాశ్వతమైనవని గుర్తించారు. అందుకే ఆరావళి జోలికి రాకుండా ఉద్యమించారు. ఢిల్లీ కాలుష్యంలో ఊపిరిసలుపక అవస్థలు పడుతున్న కేంద్ర పెద్దలు అరావళిని తమ తాబేదార్లకు తెగనమ్మే దిశగా అడుగులు వేయడం విస్మయం కలిగించక మానదు. ఎందుకంటే ఇప్పటికీ ఢిల్లీ కాలుష్య నివారణపై కదలిక కానరావడం లేదు. కాలుష్యం మూలాలను



కనిపెట్టడం లేదు. సుప్రీంకోర్టు మొట్టికాయలు వేస్తున్నా, ప్రజలు ఆందోళన చెందుతున్నా కార్యాచరణ శూన్యం ఈ దశలో ఆరావళిపై జరిగిన పోరాటం గుర్తుకు తెచ్చుకోవాల్సిందే. ఆలస్యంగానైనా లెంపలు వేసుకుని అరావళి రక్షణపై, ముఖ్యంగా గనుల తవ్వకంపై ఆంక్షలు విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం ఉత్తర్వులు జారీచేయడం ప్రజాభీష్టానికి లభించిన ఘనవిజయంగా చూడాలి. ప్రజల నిరంతర అప్రమత్తతే ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు వంటిదని నిరూపితం అయ్యింది. ర్యావరణ పరిరక్షణకూ అప్రమత్తతే రక్షణ కవచమని ఇప్పుడు ఆరావళి సాక్షిగా తేలిపోయింది. ఆరావళి పర్వతాలకు ప్రస్తుతానికైతే ముప్పు తప్పింది. కార్పొరేట్ గద్దలకు ప్రకృతి సంపదను దోచిపెట్టాలన్న దురాలోచన వెనుకపట్టు పట్టింది. ఎత్తు పేరుతో పర్యావరణాన్ని చిత్తు చేయాలన్న ఎత్తుగడ ప్రజాగ్రహం ముందు వీగిపోయింది. ఎడతెగని రైతుల పోరాటం ఫలితంగా కార్పొరేట్లకు సాగును కట్టుబానిసను చేయాలన్న పన్నాగం విఫలమై నల్లచట్టాలను వెనక్కి తీసుకున్నట్టే, దేశవ్యాప్తంగా రగులుతున్న ఆరావళి నిరసనలకు తలొగ్గి కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కార్ వెనక్కి తగ్గింది. ఎక్కడో పర్వతాలు, అడవులు.. ఎవరు తవ్వుకుంటే మనకేమీ అనుకునే రోజులు కావివి. భూమి మీద ఉండే ప్రతి పుట్టా, చెరువూ దేనికవే పర్యావరణ వ్యవస్థలకు ఆయువుగా నిలిచి ప్రాణాధారాలుగా పనిచేస్తాయి. భూమి మీదున్న అతిపురాతన పర్వత శ్రేణుల్లో ఒకటైన ఆరావళికి ఉన్న ప్రాముఖ్యం తెలియంది కాదు. మన పురాణాలు, ఉపనిషత్తులు, వేదాల్లో దీని ప్రస్తావన ఉంది. మన దేశానికి ఉత్తరాన పెట్టని కోటగోడలా నిలుస్తున్న హిమాలయాల కంటే ఆరావళి పర్వతాలే పురాతనమైనవి. దాదాపు 700 కిలోమీటర్ల పొడవున్న ఈ పర్వతశ్రేణి మరో రకంగా రక్షణ దుర్గంలా నిలుస్తున్నది. పడమర నుంచి తూర్పు ప్రాంతాలకు వీచే వేడిగాలుల ప్రభావాన్ని తగ్గించి, థార్ ఎడారి విస్తరణకు లక్ష్మణరేఖలా నిలువడం దీని ప్రత్యేకత. రాజస్థాన్, హర్యానా, గుజరాత్, ఢిల్లీ రాష్ట్రాలను చల్లగా చూసే కొండదేవరగా ఆరావళిని చెప్పుకోవచ్చు. ఇక కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న దేశ రాజధాని ఢిల్లీకి ఊపిరితిత్తుల్లాంటివని చెప్పకతప్పదు. అలాంటి ఆరావళిని కార్పొరేట్, రియల్ ఎస్టేట్ శక్తులు ఇప్పటికే మైనింగ్‌తో, చెట్ల నరికివేతతో చెరపట్టి చేయాల్సిన నష్టం చేస్తూనే ఉన్నాయి. మరోవైపు ప్రాజెక్టుల పేరిట ప్రభుత్వాలు వేల ఎకరాల అడవులను ధ్వంసం చేస్తున్నాయి. దీనిని అడ్డుకోవాల్సిన కేంద్రం మరింతగా దూకుడు పెంచి తవ్వకాలకు అనుమతులు ఇవ్వాలని చూసింది. దీనివల్ల మనకు తీరని నష్టం అని తెలిసినా పట్టించుకోలేదు. ఆరావళిని అంగడి సరుకుగా మార్చేందుకు, గనుల తవ్వకానికి రాచబాట పరిచేందుకు మోదీ సర్కార్ చేసని ప్రయత్నాలపై దెబ్బపడింది. వంద మీటర్ల ఎత్తువరకు మాత్రమే తవ్వకాలు జరపొచ్చని, అంతకన్నా ఎత్తున్నవి మాత్రమే పర్వతాలుగా పరిగణించాలని వితండవాదం చేసింది. శాస్త్రీయ విధానంలో ఏది అడవి, ఏది కాదనేది తేల్చిచెప్పాల్సిన కేంద్రమే ఎత్తును బట్టి అనుమతులను నిర్ధారించడం ద్వారా పర్యావరణ విధ్వంసానికి తోవ వేసింది. ఎత్తును బట్టి ఆరావళి పర్వతాలకు నిర్వచనమిచ్చే విధానాన్ని సర్వోన్నత న్యాయస్థానం స్వయంగా నియమించిన కమిటీ కూడా తిరస్కరించింది. దాన్ని తోసిరాజని కోర్టు ముందు సలహాదారుగా ఆ ప్రతిపాదనే ఉంచి పక్కదారి పట్టించింది. అయితే ప్రజా ఉద్యమాన్ని కోర్టు కూడా పరిగణించింది. ఆరావాళి జోలికి వెళ్లవద్దని తేల్చింది. ఆయా రాష్ట్రాలకు సూచనలు చేసింది. ఇప్పుడు ఇదే స్ఫూర్తితో ఢిల్లీ కాలుష్యంపై ప్రజలు పోరాడాలి. అప్పుడే దేశానికి విముక్తి కలుగుతుంది. కాలుష్యంతో ఢిల్లీలో ఉండలేక పోతున్నానని కేంద్రమంత్రి నితిని గడ్కరీ స్వయంగా చెప్పడం చూస్తుంటే ఢిల్లీలో ఎంతటి దారుణ పరిస్థితులు ఉన్నాయో గమనించవచ్చు. అందువల్ల కేంద్రమే స్వయంగా రంగంలోకి దిగి రాజధానిని కాలుష్యం నుంచి బయటపడేసే మార్గాలను వెతకాలి.

# బ్రహ్మోస్ క్షిపణులకు ఎంతో డిమాండ్: కేంద్రమంత్రి జితేంద్రసింగ్



**తిరుపతి,డిసెంబర్ 26:** దశాబ్ద కాలంగా స్టార్టప్‌లలో భారత్ దూసుకెళ్తోందని కేంద్రమంత్రి జితేంద్రసింగ్ అన్నారు. స్పేస్ ఎకానమీలో 8వ స్థానానికి చేరుకున్నామని చెప్పారు. ఐటీ, టెలికాం రంగాల్లో పెట్టుబడులను సరళతరం చేసినట్లు వివరించారు. తిరుపతి భారతీయ విజ్ఞాన సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. 'గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో 81వ ర్యాంక్ నుంచి 38వ ర్యాంక్‌కు చేరుకున్నాం. చంద్రుడిపై ప్రయోగాల్లో భారత్ ఘన విజయాలు సాధించింది. రక్షణరంగ ఎగుమతుల్లో గణనీయ వృద్ధి సాధించాం. మన బ్రహ్మోస్ క్షిపణులకు ఇప్పుడు ప్రపంచంలో ఎంతో డిమాండ్ ఉంది. ప్రపంచానికి కొవిడ్ వ్యాక్సిన్లు అత్యధికంగా ఎగుమతి చేసిన దేశం భారత్. శాస్త్ర, సాంకేతిక రంగాలకు మోదీ హయాంలో బ్జడెట్ పెరిగింది. అంతరిక్ష రంగంలో ప్రైవేటు పెట్టుబడులను కూడా ప్రోత్సహిస్తున్నాం. కీలక ఖనిజాల విషయంలో ప్రైవేటు సంస్థలకూ అనుమతి ఇస్తున్నాం'అని జితేంద్రసింగ్ తెలిపారు.

# గుజరాత్ కచ్‌లో స్వల్ప భూ ప్రకంపనలు



**గాంధీనగర్,డిసెంబర్ 26:** గుజరాత్‌లోని కచ్ జిల్లాలో భూ ప్రకంపనలు సంభవించాయి. శుక్రవారం తెల్లవారుజామున 4.30 గంటలకు ఈ ప్రకంపనలు వచ్చాయి. ఈ భూ ప్రకంపనల తీవ్రత రిక్టర స్కేలుపై 4.4 గా నమోదు అయింది. ఈ మేరకు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ వెల్లడించింది. ఈ భూ ప్రకంపల కేంద్రాన్ని గుర్తించినట్లు వివరించింది. 23.65 డిగ్రీల నార్త్ లాటిట్యూడ్, 70.23 ఈస్ట్ లాంగిట్యూడ్ మధ్య 10 కిలోమీటర్ల లోతులో ఈ భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు వెల్లడించింది. ఈ భూ ప్రకంపనలు సంభవించిన వెంటనే ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఈ ప్రకపంనల కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించినట్లు ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం అందలేదని ఉన్నతాధికారులు వివరించారు. మరోవైపు ఈ కచ్ జిల్లాలో తరచూ భూ ప్రకంపనలు సంభవిస్తున్న సంగతి తెలిసిందే. కానీ స్వల్ప భూ ప్రకంపనలతో ఇక్కడ భూకంపాలు సంభవిస్తున్నాయి. 2001లో గుజరాత్‌లో భారీ భూకంపం సంభవించిన సంగతి తెలిసిందే. వేలాది మంది ప్రాణాలు కోల్పోగా.. లక్షలాది మంది గాయపడ్డారు. ఈ వరుస భూప్రకంపనల కారణంగా.. స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

# ఫీల్డ్‌మార్షల్ కరియప్ప చేసిన 'ముస్తాబు'




ఆంధ్రప్రదేశ్‌లోని పాఠశాలల్లో ప్రతి తరగతి గదిలోనూ ఒక 'ముస్తాబు కార్నర్' ఏర్పాటు చేయాలని, అక్కడ సబ్బు, దువ్వెన, తువ్వాలు వంటివన్నీ ఉంచాలని నిర?యించారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు– సంతోషం. ఈ వార్త చూడగానే నాకు ఆరు దశాబ్దాల నాటి స్మృతులు గుర్తుకొచ్చాయి.మినూమసానీ ప్రజాస్వామ్య శిక్షణ సంస్థను స్థాపించారు. జేఆర్‌డీ టాటా, నానీ పాల్కీవాలా, మెహతా వంటివారు సభ్యులు. ఆ శిక్షణ శిబిరాలను గుంటూరులో కూడా నిర్వహించాం. ఒక శిబిరం ప్రారంభోత్సవం జనరల్ కరియప్ప చేతుల మీదుగా జరిగింది. విజయవాడ విమానాశ్రయంలో వారిని స్వాగతించి, గుంటూరు తీసుకొచ్చే పనిని నాకు పురమాయించారు. స్వతంత్ర భారత సైనికదళాల ప్రప్రథమ భారతీయ ప్రధానాధికారిగా 1949 జనవరి 15న ఆయన పగ్గాలు చేపట్టిన రోజును ప్రతి ఏటా 'ఆర్మీడే'గా నిర్వహిస్తున్నారు. రిటైరయినాక ఆయన ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో భారత రాయబారిగా విధులు నిర్వహించారు. పెక్కు దేశాలకు సైనిక దళాల పునర్వ్యవస్థీకరణలో సలహాలిచ్చారు. అమెరికా అధ్యక్షుడు ట్రూమన్ చేతుల మీదుగా ' అవార్డు అందుకున్నారు. 1965లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో కరియప్ప కుమారుడు కాల్పులకు గురై పాకిస్థాన్ సైనికులకు చిక్కాడు. ఈ వార్త పాక్ రేడియో ప్రసారం చేసింది. ఇది విన్న పాకిస్థాన్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్, విశ్రాంత జీవనం గడుపుతున్న జనరల్ కరియప్పకు ఫోన్ చేసి జూనియర్ కరియప్పను విడుదల చేస్తానని చెబుతాడు. "అతడు నా బిడ్డ కాదు, భరతమాత ముద్దుబిడ్డ. మాతృభూమి పరిరక్షణకు పోరాడుతున్న దేశభక్తుడు. నీవు చూపిన ఔదార్యానికి నా కృతజ్ఞతలు. విడుదల చేస్తే యుద్ధ ఖైదీలుగా ఉన్న వారందరినీ విడుదల చెయ్యి. అంతేగానీ నా పిల్లవాడని ఒక్కడినే విడుదల చెయ్యవద్దు" అని వారించాడు. ఆ విధంగా, దేశ విభజన జరగక ముందు తనవద్ద జూనియర్ అధికారిగా పనిచేసిన అయూబ్‌ఖాన్ చూపిన చొరవను కరియప్ప తిరస్కరించారు.విజయవాడ విమానాశ్రయంలో నేను కరియప్పకు స్వాగతం పలికి, కారులో గుంటూరు బయలుదేరాం. ఆజానుబాహువు– సూట్‌లో ఉన్న ఆయన డ్రైవర్ పక్కన ముందుసీటులో కూర్చున్నారు. ప్రయాణం సాగుతూండగా, మార్గంమధ్యలో అర్ధంతరంగా కారు ఆపమన్నారు కరియప్ప. గభాలున కారు దిగి, రోడ్డు పక్కనున్న ఓ ఐదేళ్ళ చిన్నపిల్లను సమీపించారు. తైల సంస్కారం లేక, చికిరిబికిరిగా జుట్టుతో ఉన్న ఆ పిల్లకు జేబులో నుంచి అద్దం తీసి చూపించి "చూడు ఎంత వికారంగా ఉన్నావో?" అంటూ మరో జేబులో నుంచి ఒక రుమాలు తీసి ఆమె ముఖం తుడిచారు. ఇంకో జేబులో నుంచి మరో జేబుగుడ్డ తీసి, దానిలో ఫేస్ పౌడర్ వేసి ఆమెకు పూశారు. దువ్వెన తీసి తల దువ్వారు. మళ్లీ అద్దం చూపించి " (ఎంత అందంగా ఉన్నావో చూడు) (ఇకపై, ప్రతిరోజూ ఇలాగే చేస్తావా?) అని అడిగాడు. ఆ పిల్లకు ఇదేమీ అర్థంగాక వింతగా చూస్తోంది. ఈయన 'జై హింద్' అని పిడికిలి బిగించి, పద వెడదాం అన్నారు నాతో.

# బాల పురస్కారం అందుకున్న క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కారాన్ని యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీఅందుకున్నారు. రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా 14 ఏళ్ల ఆ క్రికెటర్ అవార్డును స్వీకరించారు. ఢిల్లీలో ఇవాళ ఆ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ధైర్యసాహసాలు, కళలు, సంస్క ృతి, పర్యావరణం, ఇన్నోవేషన్, సైన్స్ అండ్ టెక్నాలజీ, క్రీడల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన వారికి బాల పురస్కారాన్ని ప్రతి ఏడాది అందజేస్తారు. రాష్ట్రపతి భవన్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అవార్డు స్వీకరించే క్రమంలో క్రికెటర్ వైభవ్ ఇవాళ మ్యాచ్‌కు దూరం అయ్యాడు. వాస్తవానికి బీహార్, మణిపూర్ మధ్య ఇవాళ విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్ జరుగుతున్నది. కానీ ఆ మ్యాచ్‌లో వైభవ్ ఆడడం లేదు.5 నుంచి 18 ఏళ్లు ఉన్నవారికి బాల్ పురస్కారాలు అందజేస్తారు. వైభవ్‌తో పాటు మొత్తం 19 మంది పిల్లలకు వివిధ రంగాల్లో అవార్డులను అందజేయనున్నారు. మీరు సాధించిన ఘనత యావత్ దేశానికి ప్రేరణగా నిలుస్తుందని, ఇవాళ గుర్తింపు పొందిన ప్రతి చిన్నారి చాలా ముఖ్యమైన , విలువైన వ్యక్తులు అని, అలాంటి నైపుణ్యం ఉన్న పిల్లల వల్లే ప్రపంచవ్యాప్తంగా దేశానికి గుర్తింపు వస్తున్నదని రాష్ట్రపతి ముర్ము అన్నారు.విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా రెండు రోజుల క్రితం అరుణాచల్ ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ 190 రన్స్ ఛేసిన విషయం తెలిసిందే. అయితే ఈ సీజన్‌లో అతను మళ్లీ విజయ్ హజారే మ్యాచ్‌లను ఆడేది అనుమానంగాఉన్నది. ఆ యువ క్రికెటర్ అండర్19 జట్టుతో జతకలవనున్నాడు. జనవరి 15వ తేదీ నుంచి అండర్19 వరల్డ్‌కప్ జరగనున్నది. ఆ ప్రిపరేషన్ కోసం అతను విజయ్ హజారే ట్రోఫీ మిస్సయ్యే అవకాశాలు ఉన్నాయి.

# ఇంటి కొనుగోలు లేదా నిర్మాణం కోసం అప్పుల చేయకండి




ఇల్లు కొనడం లేదా నిర్మించడం అనేది నేడు ప్రతి ఉద్యోగికీ ఒక పెద్ద కల. ఈ అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని తన సభ్యులు గృహ ఖర్చుల కోసం వారి నిధులను ఉపసంహరించుకోవడానికి అనుమతిస్తుంది. కొత్త 3.0 వ్యవస్థతో ఈ ప్రక్రియ మునుపటి కంటే సులభం, వేగంగా మారింది. అయితే గృహనిర్మాణానికి విత్‌డ్రాలు సాధ్యమే అయినప్పటికీ, డిపాజిట్ చేసిన పూర్తి మొత్తం తిరిగి ఇవ్వరు.నిబంధనల ప్రకారం.. ఇంటి కొనుగోలు లేదా నిర్మాణం, గృహ రుణం తిరిగి చెల్లించడం లేదా పునరుద్ధరణ కోసం విత్‌డ్రాలకు అనుమతి ఉంది. ఈ సౌకర్యాలు నిర్దిష్ట నియమాలు పరిమితులకు లోబడి ఉంటాయి. 3.0లో ప్రక్రియ ఆన్‌లైన్‌లోకి మారినప్పటికీ, విత్‌డ్రా పరిమితులు, షరతులు అలాగే ఉన్నాయి, అంటే ప్రక్రియ సరళంగా మారింది, నియమాలు మారలేదు. విత్‌డ్రా కోసం మీరు క్రియాశీల సభ్యుడిగా ఉండాలి, చెల్లుబాటు అయ్యే కలిగి ఉండాలి, మీ పూర్తిగా అప్డేట్ చేసి ఉండాలి. విత్‌డ్రా చేసే సమయంలో ఇల్లు మీ పేరు, మీ జీవిత భాగస్వామి పేరు లేదా ఉమ్మడి పేరు మీద ఉండాలి. యాజమాన్య రుజువు లేకుండా, గృహనిర్మాణం కోసం మీ క్లయిమ్ అంగీకరించబడదు. సాధారణంగా కొత్త ఇల్లు కొనడానికి లేదా నిర్మించడానికి కనీసం 3 నుండి 5 సంవత్సరాల సర్వీస్ అవసరం. గృహ రుణాన్ని తిరిగి చెల్లించడానికి ఈ కాలం ఎక్కువ, ఉపసంహరణలు సాధారణంగా 10 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసిన తర్వాత మాత్రమే అనుమతించబడతాయి. గృహ మరమ్మతులు లేదా పునరుద్ధరణల కోసం, ఇల్లు కనీసం 5 సంవత్సరాలు ఉనికిలో ఉండాలి.ఇల్లు కొనుగోలు చేసేటప్పుడు లేదా నిర్మించేటప్పుడు, మొత్తం %భాఖీ% బ్యాలెన్స్‌లో గరిష్టంగా 90 శాతం ఉపసంహరించుకోవచ్చు. రెండవ పరిమితి కూడా వర్తిస్తుంది, ఇది 36 నెలల ప్రాథమిక జీతం, కరువు భత్యం. ఈ రెండు మొత్తాలలో తక్కువ మొత్తం %భాఖీ%గా లభిస్తుంది. గృహ రుణాన్ని తిరిగి చెల్లించడానికి ఉపయోగిస్తుంటే, మొత్తం బ్యాలెన్స్‌లో 90 శాతం వరకు ఉపసంహరించుకోవచ్చు. అయితే పునరుద్ధరణ ప్రయోజనాల కోసం 12 నెలల ప్రాథమిక జీతం, మాత్రమే అనుమతించబడతాయి. ఈ రెండు ప్రయోజనాలను జీవితకాలంలో పరిమిత సంఖ్యలో మాత్రమే పొందవచ్చు.

# ఆమెదే ఆధిపత్యం




ఢిల్లీ: భారత క్రీడా రంగానికి మరుపురాని విజయాలను, తీపి గుర్తులను అందించిన 2025 మరో ఐదు రోజుల్లో ముగియబోతున్నది. మును పెన్నడూ లేని విధంగా ఈ ఏడాది జాతీయ, అంతర్జాతీయ క్రీడా వేదికలపై మన క్రీడాకారులు సత్తాచాటారు. మరీ ముఖ్యంగా అబ్బాయిలతో పోలిస్తే మహిళా క్రీడాకారిణులు అంచనాలకు మించి రాణించి ప్రపంచ క్రీడా యవనికపై మువ్వన్నెల పతకాన్ని సగర్వంగా రెపరెపలాడించారు. క్రికెట్‌లో మహిళల వన్డే ప్రపంచకప్, చెస్‌లో దివ్య దేశ్‌ముఖ్ కొత్త మహారాణిగా అవతరించడం, ఆర్చరీలో శీతల్ దేవి చూపిన తెగువ.. వంటి ఎన్నో ఘనతలు ఈ ఏడాదే సొంతమయ్యాయి. ఏడాదికి వీడ్కోలు చెప్పబోతున్న సందర్భంగా పలు క్రీడల్లో భారత క్రీడాకారులు సాధించిన విజయాలు, అందుకున్న ఘనతలు, చేదు ఓటములు, మరుపురాని క్షణాలపై ప్రత్యేక కథనం.అందిన ద్రాక్షభారత్‌లో క్రికెట్‌కు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పన్లేదు. అయితే పురుషులతో పాటు మహిళలూ ఈ ఆట ఆడుతున్నా.. మెన్స్ టీమ్స్‌కున్న సౌకర్యాలు, వారికున్నంత ఆకర్షణ, వేతనాల్లో వివక్ష వంటి ఎన్నో ఇబ్బందులను 'ఉమెన్ ఇన్ బ్లూ' ఎదుర్కొన్నది. దీనికి తోడు భారత ఖాతాలో ఎన్నో దశాబ్దాలుగా ఊరిస్తున్న ఐసీసీ టైటిల్ కలను స్వదేశంలో అయినా ఒడిసిపట్టాలనే ఒత్తిడి.. ఇలాంటి ఎన్నో ప్రతికూల పరిస్థితుల నడుమ ఈ టోర్నీ ఆడిన హర్మన్‌ప్రీత్ కౌర్ సేన సగర్వంగా ఐసీసీ కప్పు కలను నెరవేర్చుకుని సరికొత్త చరిత్ర సృష్టించింది. లీగ్ దశలో సో సో గానే ఉన్న భారత ప్రదర్శన.. సెమీస్‌కు చేరాక శిఖర స్థాయిని చేరుకుంది. ప్రపంచకప్ విజయం భారత మహిళా క్రికెట్ రూపురేఖలను సమూలంగా మార్చివేసిందని చెప్పడంలో వీసమెత్తు సందేహం అక్కర్లేదు. ఈ ఏడాది అండర్-19 ఉమెన్స్ టీ20 వరల్డ్ కప్‌ను భారత్ రిటైన్ చేసుకుంది. పురుషుల క్రికెట్‌లో మాత్రం ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌ను డ్రా చేసుకున్నా స్వదేశంలోనే దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టులను కోల్పోయి అవమానకర ఓటమిని మూటగట్టుకుంది.గురి తప్పలేదుఈ ఏడాది భారత క్రీడారంగంలో అత్యధిక పతకాలు సాధించిన క్రీడల్లో ఒకటి షూటింగ్. మను భాకర్ వంటి స్టార్ షూటర్లకు ఈ ఏడాది కలిసిరాకపోయినా సురుచి సింగ్, సిమ్రన్‌ప్రీత్ కౌర్, సామ్రాట్ రాణా వంటి యువ షూటర్లు మాత్రం అదరగొట్టారు. ఏడాది పొడుగునా ఈ త్రయం నిలకడగా పతకాలు సాధించింది. బ్యూనస్ ఎయిర్స్‌లో మొదలైన ప్రపంచకప్ ఆరంభ సీజన్ నుంచి మొన్నటి దోహాలో ముగిసిన సీజన్ ఎండింగ్ ఫైనల్స్ దాకా పతకాలు కొల్లగొట్టారు.19 ఏండ్ల జజ్జర్ అమ్మాయి సురుచి అయితే మిగిలిన షూటర్ల కంటే మెరుగ్గా రాణించి లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో పతకాన్ని తీసుకొచ్చే అథ్లెట్ల రేసులో నిలిచింది. హైదరాబాదీ షూటర్ ఇషా సింగ్ కూడా కీలక టోర్నీల్లో మెరుగైన ప్రదర్శన చేసింది.దివ్యమైన విజయంగత కొన్నేండ్లుగా నిలకడగా ఎదుగుతున్న భారత చదరంగం.. ఈ ఏడాది కొత్త ఎత్తులకు చేరింది. 2024లో గుకేశ్ వరల్డ్ చాంపియన్‌గా నిలువగా 2025లో దివ్య దేశ్‌ముఖ్ ఫిడే ఉమెన్స్ వరల్డ్ కప్‌ను సొంతం చేసుకుని ఈ టోర్నీ గెలిచిన తొలి భారత మహిళా క్రీడాకారిణిగా రికార్డులకెక్కింది. ఇందుకు సంబంధించిన ఫైనల్‌లో దివ్య ప్రత్యర్థి కోనేరు హంపియే కావడం మరో విశేషం. ఒక్క విజయంతో వరల్డ్ కప్ సొంతం చేసుకోవడమే గాక 19 ఏండ్ల ఈ నాగ్‌పూర్ అమ్మాయి.. గ్రాండ్‌మాస్టర్ హోదాతో పాటు 2026 క్యాండిడేట్స్ టోర్నమెంట్‌కు నేరుగా అర్హత సాధించింది. ఈ ఏడాది భారత్.. గోవాలో చెస్ వరల్డ్ కప్‌ను విజయవంతంగా నిర్వహించింది. నిరుడు వరుస విజయాలతో సత్తాచాటిన గుకేశ్ ఈ ఏడాది ఆశించిన స్థాయిలో రాణించలేకపోయినా ప్రజానంద, అర్జున్ ఇరిగేసి కీలక టోర్నీల్లో నిలకడగా ఆడారు.బ్యాడ్మింటన్‌లో కొత్త రక్తందశాబ్దాలుగా భారత బ్యాడ్మింటన్ మహిళల సింగిల్స్ భారాన్ని మోస్తున్న డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ పీవీ సింధు కెరీర్ చరమాంకంలో ఉంది. సైనా నెహ్వాల్ కూడా ఆట నుంచి తప్పుకుంది. పారిస్ ఒలింపిక్స్ తర్వాత సింధు వరుస వైఫల్యాలతో చతికిలపడుతున్న వేళ.. ఉమెన్స్ సింగిల్స్‌లో వీరి తర్వాత ఎవరా? అన్న ప్రశ్నకు తామున్నామని భరోసా ఇస్తున్నారు ఇద్దరు యువ షట్లర్లు. వారే ఉన్నతి హుడా, తన్వి శర్మ. జూనియర్ స్థాయిలో అదరగొడుతున్న ఈ ఇద్దరూ 2025లో చెప్పుకోదగ్గ విజయాలు సాధించి మహిళల విభాగంలో కొత్త ఆశలు రేపుతున్నారు. ఈ ఏడాది జూన్‌లో జరిగిన చైనా ఓపెన్‌లో ఉన్నతి.. సింధును ఓడించి సంచలనం సృష్టించింది. ఆమె ప్రస్తుతం టాప్-15 ర్యాంకుకు చేరడం గమనార్హం. అక్టోబర్‌లో అసోం వేదికగా జరిగిన బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ జూనియర్ చాంపియన్‌షిప్స్‌లో తన్వి అందరి అంచనాలను తలకిందులు చేస్తూ రజతం గెలిచింది.శీతల్ సంచలనంఆర్చరీలోనూ ఈ ఏడాది భారత్ చెప్పుకోదగ్గ ప్రదర్శనలే చేసింది. ఈ క్రీడలో ఎవరూ ఊహించని విధంగా రెండు చేతులు లేకున్నా ప్రపంచ వేదికలపై సత్తాచాటి అందరినోట శెభాష్ అనిపించుకుంది మాత్రం శీతల్ దేవి. 18 ఏండ్ల శీతల్.. పారాలింపిక్స్‌లో కాంస్యం సాధించడమే గాక గ్వాంగ్జు (దక్షిణ కొరియా)లో జరిగిన వరల్డ్ చాంపియన్ పారా ఆర్చరీ ఫైనల్‌లో ఒజ్నూర్ గిర్డి (టర్కీ)కి షాకిచ్చింది. ఇదే టోర్నీ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో కాంస్యం గెలిచింది. అంతేగాక వైకల్యపు అడ్డుగోడల్ని బద్దలుకొడుతూ అన్ని అవయవాలు సక్రమంగా పనిచేసే ఆర్చర్లు పాల్గొనే టోర్నీలోనూ ఆడి తన ఆత్మవిశ్వాసాన్ని చాటుకుంది. ఇక మిగిలిన ఆర్చర్ల విషయానికొస్తే కాంపౌండ్ విభాగంలో జ్యోతి సురేఖ వెన్నం, అభిషేక్ వర్మ, రిషభ్ యాదవ్ స్థాయికి తగ్గ ప్రదర్శనలు చేశారు. ఫలితంగా ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్స్‌లో భారత్ ఏకంగా 10 పతకాలు సాధించి ఈ టోర్నీలో దక్షిణ కొరియా ఆధిపత్యానికి గండికొట్టింది.

# అతి తక్కువ టైమ్‌లో రూ.17 లక్షలు మీ చేతికి రావాలంటే ఇదే బెస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్



పోస్ట్ ఆఫీస్ పథకం సురక్షితమైన, ప్రభుత్వ హామీ గల పెట్టుబడి. తక్కువ మొత్తంతో ప్రారంభించి, మంచి రాబడిని పొందవచ్చు. రోజుకు రూ.333 పొదుపుతో 10 ఏళ్లలో రూ.17 లక్షల వరకు కూడబెట్టవచ్చు. ఇది స్థిరమైన వడ్డీ రేటుతో (6.70 శాతం) సాధారణ పౌరులకు అనువైన పొదుపు మార్గం.ప్రతి ఒక్కరూ సురక్షితమైన భవిష్యత్తును కోరుకుంటున్నారు. రిస్క్ లేకుండా పెట్టుబడి పెట్టి మంచి రాబడి రావాలని ఆశిస్తారు. మీరు కూడా అలాంటి ప్లాన్స్‌లో ఉంటే పోస్ట్ ఆఫీస్ పథకాలు బెస్ట్ ఆప్షన్ కావొచ్చు. ఇవి ప్రభుత్వ హామీతో కూడినవి, స్థిర రాబడిని అందిస్తాయి. అటువంటి ప్రసిద్ధ పథకం పోస్ట్ ఆఫీస్ రికరింగ్ డిపాజిట్ పథకం గురించి ఇప్పుడు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. పోస్ట్ ఆఫీస్ అతిపెద్ద ప్రయోజనం ఏమిటంటే మీరు చాలా తక్కువ మొత్తంతో పెట్టుబడి పెట్టడం ప్రారంభించవచ్చు. సగటు వ్యక్తి బడ్జెట్‌ను దృష్టిలో ఉంచుకుని రూపొందించబడిన ఈ పథకం, రోజువారీ పొదుపు ద్వారా క్రమంగా గణనీయమైన కార్పస్‌ను నిర్మించాలనుకునే వారికి అనువైనది. పెట్టుబడులు ప్రస్తుతం త్రైమాసికానికి ఒకసారి 6.70 శాతం వార్షిక వడ్డీ రేటును అందిస్తున్నాయి.ప్రతి ఒక్కరూ సురక్షితమైన భవిష్యత్తును కోరుకుంటున్నారు. రిస్క్ లేకుండా పెట్టుబడి పెట్టి మంచి రాబడి రావాలని ఆశిస్తారు. మీరు కూడా అలాంటి ప్లాన్స్‌లో ఉంటే పోస్ట్ ఆఫీస్ పథకాలు బెస్ట్ ఆప్షన్ కావొచ్చు. ఇవి ప్రభుత్వ హామీతో కూడినవి, స్థిర రాబడిని అందిస్తాయి. అటువంటి ప్రసిద్ధ పథకం పోస్ట్ ఆఫీస్ రికరింగ్ డిపాజిట్ () పథకం గురించి ఇప్పుడు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. పోస్ట్ ఆఫీస్ అతిపెద్ద ప్రయోజనం ఏమిటంటే మీరు చాలా తక్కువ మొత్తంతో పెట్టుబడి పెట్టడం ప్రారంభించవచ్చు. సగటు వ్యక్తి బడ్జెట్‌ను దృష్టిలో ఉంచుకుని రూపొందించబడిన ఈ పథకం, రోజువారీ పొదుపు ద్వారా క్రమంగా గణనీయమైన కార్పస్‌ను నిర్మించాలనుకునే వారికి అనువైనది. పెట్టుబడులు ప్రస్తుతం త్రైమాసికానికి ఒకసారి 6.70 శాతం వార్షిక వడ్డీ రేటును అందిస్తున్నాయి. ఖాతాను ఎవరు తెరవొచ్చు?.. ఈ పథకం దాదాపు ప్రతి భారతీయ పౌరుడికి అందుబాటులో ఉంది. ఉద్యోగి అయినా, వ్యాపారవేత్త అయినా, విద్యార్థి అయినా, ఎవరైనా ఖాతాను తెరవవచ్చు. 10 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న పిల్లల పేరుతో కూడా తెరవవచ్చు. ఖాతాలను పోస్టాఫీసులో లేదా ఆన్‌లైన్‌లో తెరవవచ్చు. 18 ఏళ్లు నిండిన తర్వాత అప్డేట్ అవసరం. ఖాతాను ఎవరు తెరవొచ్చు?.. ఈ పథకం దాదాపు ప్రతి భారతీయ పౌరుడికి అందుబాటులో ఉంది. ఉద్యోగి అయినా, వ్యాపారవేత్త అయినా, విద్యార్థి అయినా, ఎవరైనా ఖాతాను తెరవవచ్చు. 10 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న పిల్లల పేరుతో కూడా తెరవవచ్చు. ఖాతాలను పోస్టాఫీసులో లేదా ఆన్‌లైన్‌లో తెరవవచ్చు. 18 ఏళ్లు నిండిన తర్వాత అప్డేట్ అవసరం. మెచ్యురిటీ పిరియడ్ పెంచుకోవచ్చా?.. పోస్ట్ ఆఫీస్ అసలు కాలపరిమితి 5 సంవత్సరాలు. అయితే మెచ్యురిటీ తర్వాత దీనిని మరో 5 సంవత్సరాలు పొడిగించవచ్చు. అంటే మీరు మొత్తం 10 సంవత్సరాలు ఈ పథకంలో పెట్టుబడి పెట్టడం కొనసాగించవచ్చు. మూడు సంవత్సరాల తర్వాత, అవసరమైతే ఖాతాను మూసివేసే అవకాశం కూడా మీకు ఉంది. ఖాతాదారుడు మరణించిన సందర్భంలో నామినీ నిధులను క్లెయిమ్ చేసుకోవచ్చు, కావాలనుకుంటేని కొనసాగించవచ్చు. మెచ్యురిటీ పిరియడ్ పెంచుకోవచ్చా?.. పోస్ట్ ఆఫీస్ అసలు కాలపరిమితి 5 సంవత్సరాలు. అయితే మెచ్యురిటీ తర్వాత దీనిని మరో 5 సంవత్సరాలు పొడిగించవచ్చు. అంటే మీరు మొత్తం 10 సంవత్సరాలు ఈ పథకంలో పెట్టుబడి పెట్టడం కొనసాగించవచ్చు. మూడు సంవత్సరాల తర్వాత, అవసరమైతే ఖాతాను మూసివేసే అవకాశం కూడా మీకు ఉంది. ఖాతాదారుడు మరణించిన సందర్భంలో నామినీ నిధులను క్లెయిమ్ చేసుకోవచ్చు, కావాలనుకుంటే %=ణ%ని కొనసాగించవచ్చు.రోజుకు రూ.333 ఆదాతో రూ.17 లక్షలు.. ఇప్పుడు అసలు లెక్క గురించి మాట్లాడుకుందాం. మీరు రోజుకు దాదాపు రూ. 333 ఆదా చేస్తే, మీకు నెలకు దాదాపు రూ. 10,000 పెట్టుబడి ఉంటుంది. మీ మొత్తం డిపాజిట్ 5 సంవత్సరాలలో దాదాపు రూ. 6 లక్షలకు చేరుకుంటుంది. ఈ కాలంలో మీరు దాదాపు రూ. 1.13 లక్షల వడ్డీని సంపాదించవచ్చు.రోజుకు రూ.333 ఆదాతో రూ.17 లక్షలు.. ఇప్పుడు అసలు లెక్క గురించి మాట్లాడుకుందాం. మీరు రోజుకు దాదాపు రూ. 333 ఆదా చేస్తే, మీకు నెలకు దాదాపు రూ. 10,000 పెట్టుబడి ఉంటుంది. మీ మొత్తం డిపాజిట్ 5 సంవత్సరాలలో దాదాపు రూ. 6 లక్షలకు చేరుకుంటుంది. ఈ కాలంలో మీరు దాదాపు రూ. 1.13 లక్షల వడ్డీని సంపాదించవచ్చు.మీరు మీ ని మరో 5 సంవత్సరాలు పొడిగిస్తే, మొత్తం పెట్టుబడి వ్యవధి 10 సంవత్సరాలు అవుతుంది. అప్పటికి మీ మొత్తం డిపాజిట్ సుమారు రూ.12 లక్షలకు చేరుకుంటుంది. వడ్డీ సుమారు రూ.5.08 లక్షలకు పెరుగుతుంది. అంటే మీరు పరిపక్వత సమయంలో సుమారు రూ.17.08 లక్షల కార్పస్ పొందవచ్చు. తక్కువ పెట్టుబడి ఉన్నవారికి కూడా ఈ పథకం ప్రయోజనకరంగా ఉంటుంది. ఉదాహరణకు నెలకు రూ.5,000 %=ణ% 10 సంవత్సరాలలో సుమారు రూ.8.5 లక్షల రాబడిని ఇస్తుంది.మీరు మీ మరో 5 సంవత్సరాలు పొడిగిస్తే, మొత్తం పెట్టుబడి వ్యవధి 10 సంవత్సరాలు అవుతుంది. అప్పటికి మీ మొత్తం డిపాజిట్ సుమారు రూ.12 లక్షలకు చేరుకుంటుంది. వడ్డీ సుమారు రూ.5.08 లక్షలకు పెరుగుతుంది. అంటే మీరు పరిపక్వత సమయంలో సుమారు రూ.17.08 లక్షల కార్పస్ పొందవచ్చు. తక్కువ పెట్టుబడి ఉన్నవారికి కూడా ఈ పథకం ప్రయోజనకరంగా ఉంటుంది. ఉదాహరణకు నెలకు రూ.5,000 10 సంవత్సరాలలో సుమారు రూ.8.5 లక్షల రాబడిని ఇస్తుంది.

# విరాట్ విశ్వరూపం ౨౯ బంతుల్లోనే హాఫ్ సెంచరీ



సుమారు 15 ఏళ్ల తర్వాత విజయ్ హజారే ట్రోఫీలోకి అడుగుపెట్టిన టీమిండియా రన్ మెషీన్ విరాట్ కోహ్లీ, దేశవాళీ క్రికెట్‌లో పరుగుల సునామీ సృష్టిస్తున్నాడు. మొదటి మ్యాచ్‌లోనే అదుతేమైన సెంచరీతో పలకరించిన కోహ్లీ, రెండో మ్యాచ్‌లోనే అంతకు మించిన జోరును ప్రదర్శించాడు. ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపిస్తూ కేవలం 29 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసి స్టేడియాన్ని హోరెత్తించాడు. వన్డే ఫార్మాట్ మ్యాచ్‌లో టీ20 రేంజ్ బ్యాటింగ్‌తో విరాట్ విరుచుకుపడటం ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ అవుతోంది.బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ వేదికగా శుక్రవారం గుజరాత్‌తో జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌లో ఢిల్లీ తరపున కోహ్లీ ఈ విధ్వంసం సృష్టించాడు. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ జట్టు, రెండో ఓవర్‌లోనే తొలి వికెట్ కోల్పోయింది. దీంతో విరాట్ కోహ్లీకి బ్యాటింగ్ చేయడానికి ఎంతో సమయం దొరికింది. క్రీజులోకి రాగానే ఫోర్‌తో తన ఇన్నింగ్స్ మొదలుపెట్టిన విరాట్, ఆ తర్వాత అసలు గ్యాప్ ఇవ్వలేదు. ఒకవైపు తోటి బ్యాటర్ అర్పిత్ రాణా పరుగులు తీయడానికి కష్టపడుతుంటే, మరోవైపు కోహ్లీ మాత్రం కేవలం బౌండరీలతోనే స్కోర్ బోర్డును ఉరికించాడు.ఈ ఇన్నింగ్స్‌లో విరాట్ చేసిన మ్యాజిక్ ఏంటంటే.. తను చేసిన మొదటి 53 పరుగులలో ఏకంగా 50 పరుగులు కేవలం బౌండరీల (11 ఫోర్లు, 1 సిక్స్) ద్వారానే వచ్చాయి. అంటే పరుగుల కోసం విరాట్ పెద్దగా కష్టపడకుండానే బంతులను సరిహద్దులు దాటించాడు. కేవలం 29 బంతుల్లోనే హాఫ్ సెంచరీ మార్కును అందుకున్న విరాట్, తన లిస్ట్-ఏ కెరీర్‌లో 85వ ఫిఫ్టీని ఖాతాలో వేసుకున్నాడు. గత మ్యాచ్‌లో 101 బంతుల్లో 131 పరుగులు చేసిన కోహ్లీ, అదే దూకుడును ఈ మలుస్తాడనుకున్న తరుణంలో విరాట్ అవుట్ అయ్యాడు. మొత్తం 58 బంతుల్లో 77 పరుగులు చేసిన కోహ్లీ, లెఫ్ట్ హ్యాండ్ స్పిన్నర్ విశాల్ జైస్వాల్ బౌలింగ్‌లో స్టంప్ అవుట్ అయి వెనుదిరిగాడు. తన ఇన్నింగ్స్‌లో మొత్తం 13 ఫోర్లు, ఒక సిక్సర్ బాదాడు. సెంచరీ మిస్ అయినప్పటికీ, విరాట్ ఆడిన తీరు చూస్తుంటే ఆయన ఫుల్ ఫామ్‌లో ఉన్నాడని, రాబోయే సిరీస్‌ల కోసం సిద్ధంగా ఉన్నాడని స్పష్టమవుతోంది. రోహిత్ శర్మ రెండో మ్యాచ్‌లో డకౌట్ అవ్వగా, కోహ్లీ మాత్రం తన జోరును కొనసాగించి అభిమానులను ఖుషీ చేశాడు.


# ఇవాళ ఒక్కరోజే రూ.9 వేలు




బంగారం ధరలు శుక్రవారం భారీగా పెరిగాయి. తులం బంగారంపై రూ.800 మేర పెరగ్గా.. వెండి ధర రూ.9 వేల వరకు పెరిగింది. బంగారం ధర లక్షన్నర మార్క్‌కు చేరువలో ఉంది. త్వరలోనే లక్షన్నర మార్క్‌కు చేరుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇవాళ వివిధ ప్రాంతాల్లో ధరలు ఇలా ఉన్నాయి.బంగారం, వెండి ధరలు మరోసారి రికార్డ్ దిశగా దూసుకెళు త్నాయి. మరోసారి లక్షా 40 వేల మార్క్‌కు చేరుకుంది గోల్డ్. ఈ మార్క్‌కు గోల్డ్ రేటు చేసుకోవడం ఈ వారంలో ఇది రెండోసారి. ఈ వారం ప్రారంభం నుంచే బంగారం ధరలు రికార్డ్ స్థాయిలో పెరుగుతూ వస్తోన్నాయి. వేలకు వేలు పెరుగుతూ వస్తుండటంతో కొనుగోలుదారులకు భారంగా మారింది. అసలు పండుగ సీజన్ కావడంతో ఈ ధరల పెరుగులతో బంగారం కొనుగోలు చేయాలనుకునేవారు వెనకడుగు వేస్తున్నారు.బంగారం, వెండి ధరలు మరోసారి రికార్డ్ దిశగా దూసుకెళ్తున్నాయి. మరోసారి లక్షా 40 వేల మార్క్‌కు చేరుకుంది గోల్డ్. ఈ మార్క్‌కు గోల్డ్ రేటు చేసుకోవడం ఈ వారంలో ఇది రెండోసారి. ఈ వారం ప్రారంభం నుంచే బంగారం ధరలు రికార్డ్ స్థాయిలో పెరుగుతూ వస్తోన్నాయి. వేలకు వేలు పెరుగుతూ వస్తుండటంతో కొనుగోలుదారులకు భారంగా మారింది. అసలు పండుగ సీజన్ కావడంతో ఈ ధరల పెరుగులతో బంగారం కొనుగోలు చేయాలనుకునేవారు వెనకడుగు వేస్తున్నారు.శుక్రవారం ఏకంగా తులం బంగారంపై రూ.770 పెరిగింది. హైదరాబాద్‌లో నేడు 10 గ్రాముల 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,40,020కి చేరుకోగా.. నిన్న ఈ ధర రూ.1,39,251 వద్ద స్థిరపడింది. గురువారంతో పోలిస్తే శుక్రవారానికి రూ.770 పెరిగినందని చెప్పవచ్చు. ఇక 22 క్యారెట్ల బంగారంపై రూ.700 పెరిగింది. ఇవాళ 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,28,350గా ఉంది. నిన్న ఈ ధర రూ.1,27,650 వద్ద స్థిరపడింది.శుక్రవారం ఏకంగా తులం బంగారంపై రూ.770 పెరిగింది. హైదరాబాద్‌లో నేడు 10 గ్రాముల 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,40,020కి చేరుకోగా.. నిన్న ఈ ధర రూ.1,39,251 వద్ద స్థిరపడింది. గురువారంతో పోలిస్తే శుక్రవారానికి రూ.770 పెరిగినందని చెప్పవచ్చు. ఇక 22 క్యారెట్ల రూ.700 పెరిగింది. ఇవాళ 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,28,350గా ఉంది. నిన్న ఈ ధర రూ.1,27,650 వద్ద స్థిరపడింది.

# 1000 కోట్ల క్లబ్‌లో 'ధురంధర్'..

## 2025 బాక్సాఫీస్ కింగ్‌గా రణ్‌వీర్ సింగ్!




బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటించిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించింది. విడుదలైన 21 రోజుల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.1,000 కోట్ల గ్రాస్ వసూళ్ల మైలురాయిని దాటింది. క్రిస్మస్ పర్వదినం (డిసెంబర్ 25) రోజున ఈ అరుదైన ఘనతను అందుకున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థలు జియో స్టూడియోస్, బీ62 స్టూడియోస్ అధికారికంగా ప్రకటించాయి. దీంతో, ఈ క్లబ్‌లో చేరిన 9వ భారతీయ చిత్రంగా 'ధురంధర్' రికార్డు సృష్టించింది.

డిసెంబర్ 5న విడుదలైన ఈ సినిమా, తొలి రోజు నుంచే పాజిటివ్ టాక్‌తో దూసుకెళ్లింది. ట్రేడ్ వర్గాల నివేదికల ప్రకారం, 21వ రోజు ముగిసేసరికి ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.1006.7 కోట్లు వసూలు చేసింది. ఇందులో భారతదేశం నుంచి రూ.668.80 కోట్ల నెట్ (రూ.789.18 కోట్ల గ్రాస్) వసూళ్లు రాగా, ఓవర్సీస్ మార్కెట్ల నుంచి రూ.217.50 కోట్లు వచ్చాయి. ఈ విజయంతో, 2025లో అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ చిత్రంగా 'కాంతార: చాప్టర్ 1'ను 'ధురంధర్' అధిగమించింది.

ఈ విజయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ జియో స్టూడియోస్ ఒక పోస్టర్‌ను విడుదల చేసింది. "1000 కోట్ల క్లబ్‌లో గర్వంగా అడుగుపెట్టాం. 'ధురంధర్' ప్రభంజనం ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతోంది" అని పేర్కొంది. ఈ సినిమా విజయంపై చిత్ర పరిశ్రమ నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. దర్శకుడు రామ్ గోపాల్ వర్మ, దర్శకుడు ఆదిత్య ధర్‌ను ప్రశంసిస్తూ ట్వీట్ చేశారు. ఈ సినిమాకు లభిస్తున్న అద్భుతమైన స్పందనతో చిత్రబృందం సీక్వెల్‌ను కూడా ప్రకటించింది. 'ధురంధర్ పార్ట్ 2: ది రివెంజ్' పేరుతో రానున్న ఈ చిత్రాన్ని 2026 మార్చి 19న విడుదల చేయనున్నట్లు తెలిపింది. ఈ సీక్వెల్‌ను హిందీతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లోనూ విడుదల చేయనుండటం విశేషం. ఆదిత్య ధర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రణ్‌వీర్‌తో పాటు అక్షయ్ ఖన్నా, సంజయ్ దత్, ఆర్. మాధవన్ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమాతో రణ్‌వీర్ సింగ్ తన కెరీర్‌లోనే అతిపెద్ద విజయాన్ని అందుకుని, షారుఖ్ ఖాన్, ప్రభాస్ వంటి స్టార్ల సరసన నిలిచారు.

# నాగ చైతన్య కోసం సితార పెద్ద సెటప్..!



సితార ఎంటర్టైన్మెంట్స్ టాలీవుడ్ లో ప్రస్తుతం స్మాల్, మీడియం నుంచి భారీ బడ్జెట్ సినిమాలు చేస్తున్న నిర్మాణ సంస్థ. సూర్యదేవర నాగ వంశీ ఈ బ్యానర్ లో వరుస సినిమాలు నిర్మిస్తున్నారు. ఐతే ఈ బ్యానర్ లో మొదటి సినిమాగా వచ్చింది శైలజా రెడ్డి అల్లుడు. నాగ చైతన్య తోనే ఈ బ్యానర్ మొదలైంది. ఆ తర్వాత సక్సెస్ ఫుల్ సినిమాలు చేస్తూ ఆడియన్స్ ని అలరిస్తుంది. 2018లో నాగ చైతన్యతో శైలజా రెడ్డి అల్లుడు చేసిన సితార నాగ వంశీ ఈ ఏడేళ్లలో ఎన్నో సినిమాలు చేశారు. . నాగ చైతన్య 25వ సినిమా కోసం.. ఐతే మళ్లీ నాగ చైతన్యతో చేసే అవకాశం రాలేదు. నాగ చైతన్య కూడా తనతో బ్యానర్ మొదలు పెట్టి మరో సినిమా చేయట్లేదని నాగ వంశీని అడుగుతున్నాడట. ఐతే ఆ విషయాన్నే రీసెంట్ ఇంటర్వ్యూలో ప్రస్తావించారు నాగ వంశీ. నాగ చైతన్య కోసం ఒక భారీ ప్లాన్ ఉందని అంటున్నారు నాగ వంశీ. నాగ చైతన్య 25వ సినిమా కోసం పెద్ద సెటప్ రెడీ చేస్తున్నామని అన్నారు. కుదిరితే 25వ సినిమా లేదంటే ఎప్పుడైనా సరే నాగ చైతన్యతో సినిమా మాత్రం వేరే లెవెల్ లో ఉంటుందని అంటున్నారు నాగ వంశీ. ఎందుకంటే తమ తొలి సినిమా హీరో కాబట్టి కచ్చితంగా అతని మీద స్పెషల్ ఇంట్రెస్ట్ ఉంటుంది. నాగ చైతన్య కూడా తండేల్ తర్వాత కెరీర్ మీద మరింత ఫోకస్ తో సినిమాలు చేస్తున్నాడు. ప్రస్తుతం కార్తీక్ దండుతో సినిమా చేస్తున్న చైతన్య నెక్స్ట్ సితార తో దాదాపు కన్ ఫర్మ్ అయినట్టే అని తెలుస్తుంది.

# డైరెక్టర్ తో పెళ్లి.. ?

## క్లారిటీ ఇచ్చిన బ్యూటీ!



సెలబ్రిటీలు ఎప్పుడైనా ఎవరితో అయినా కలిసి కనిపిస్తే చాలు.. వారి మధ్య ఎఫైర్ రూమర్స్ సృష్టిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఒక్కొక్కసారి ఆ రూమర్స్ నిజం అవుతాయి కూడా.. ఈ క్రమంలోనే తాజాగా ప్రముఖ హీరోయిన్ ఈషా రెబ్బా గురించి కూడా గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో రూమర్స్ వైరల్ అవడంతో ఈ విషయాలపై ఆమె స్పందిస్తూ రూమర్స్ కి చెక్ పెట్టింది.

తెలుగమ్మాయిగా తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న ఈమె గత కొద్ది రోజులుగా ప్రముఖ డైరెక్టర్, నటుడు అయిన తరుణ్ భాస్కర్ తో ప్రేమలో పడిందని, వివాహం కూడా చేసుకోబోతోంది అంటూ రూమర్స్ ఎక్కువగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా వీరిద్దరూ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం ఓం శాంతి శాంతి శాంతి. ఇటు విడుదలకు దగ్గరవుతున్న నేపథ్యంలోనే.. వీరి వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వార్తలు ఇప్పుడు సోషల్ మీడియాలో జోరుగా వినిపిస్తున్నాయి.. ఇకపోతే ఈ చిత్రానికి ఏ.ఆర్ సజీవ దర్శకత్వం వహిస్తూ ఉండగా.. ఒరిజినల్స్, మూవీ వెర్స్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది . వచ్చే ఏడాది జనవరి 23న థియేటర్లలోకి రాబోతోంది ఈ సినిమా. ఇటు సినిమాపై అంచనాలు పెరుగుతున్న నేపథ్యంలో.. మరోవైపు వీరిద్దరి మధ్య ప్రేమ, పెళ్లి అంటూ రూమర్లు జోరుగా వినిపిస్తున్నాయి. అలా ఈ సినిమా షూటింగ్ సమయంలోనే వీరిద్దరూ ప్రేమలో పడ్డారని.. త్వరలోనే పెళ్లి కూడా చేసుకోబోతున్నారు అంటూ వార్తలు ఊపందుకున్నాయి. దీనికి తోడు వీరిద్దరూ ఇటీవల తిరుమలలో కలిసి సందడి చేయగా.. అందుకు సంబంధించిన వీడియోలు , ఫోటోలు కూడా వైరల్ అవ్వడంతోనే ఈ వార్తలు మరింత బలంగా వినిపిస్తున్న కారణంగా.. తాజాగా తన ఇన్స్టాగ్రామ్ వేదికగా ఒక వీడియోని పంచుకుంది. ఎప్పుడు పెళ్లి చేసుకుంటారు? అని అడిగే వారికి సమాధానంగా ఒక వైరల్ మీమ్ వీడియోని పోస్ట్ చేసింది. ఇందులో ఒక రాజకీయ నాయకుడు ఇంగ్లీషు స్పీచ్ ని బ్యాగ్రౌండ్ లో ఉపయోగిస్తూ.." ఏ పనులు ఏ సమయంలో జరగాలో.. అవి ఆ సమయంలోనే జరిగి తీరుతాయి" అనే డైలాగ్ జత చేసింది. మొత్తానికైతే తన పెళ్లిని కాలమే నిర?యిస్తుందని.. పెళ్లికి ఇప్పట్లో తొందర ఏమీ లేదు అన్నట్లుగానే కామెంట్ చేసింది. ప్రస్తుతం ఈ వైరల్ మీమ్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో ఒక్క వీడియోతో డైరెక్టర్ తో పెళ్లి పై క్లారిటీ ఇచ్చింది ఈ ముద్దుగుమ్మ అంటూ నెటిజన్స్ కామెంట్ చేస్తున్నారు. ఏది ఏమైనా ఇన్ని రోజులు వస్తున్న రూమర్స్ కి చెక్ పెట్టింది. ఇక తాజాగా వీరు నటిస్తున్న ఓం శాంతి శాంతి శాంతి సినిమా విషయానికొస్తే.. ఈ సినిమా ఒక మలయాళ హిట్ మూవీకి రీమేక్ అన్నట్టు సమాచారం. మరి జనవరి 23న థియేటర్లలోకి రాబోతున్న ఈ సినిమా ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

# ట్రోల్స్ గురించి ఆలోచిస్తూ కూర్చోవద్దు : తేజ సజ్జా



తనపై వచ్చిన ట్రోల్స్‌పై యువ నటుడు తేజ సజ్జా స్పందించారు. పెద్ద పెద్ద హీరోలను కూడా ట్రోల్స్ చేస్తుంటారని, జాతీయ అవార్డులు వచ్చిన చిత్రాలపై కూడా విమర్శలు వస్తుంటాయని ఆయన అన్నారు. తాజాగా విలేకరులతో మాట్లాడిన ఆయన, ఎవరో ఏదో అన్నారని ఆలోచిస్తూ కూర్చుంటే ముందుకు కదలలేమని అన్నారు. మన ప్రతిభను నమ్ముకుంటూ ముందుకు సాగాలని పేర్కొన్నారు.

ఇప్పుడు కాకపోతే పదేళ్ల తర్వాత అయినా మనపై వచ్చిన విమర్శలకు సమాధానాలు దొరుకుతాయని, అసలు వాస్తవాలు తెలుస్తాయని అన్నారు. దేనికైనా సమయం రావాలని, అప్పుడే మన విలువ తెలుస్తుందని అన్నారు. విమర్శించే వారి గురించి ఆలోచిస్తే పని చేయలేమని అన్నారు. ప్రేక్షకులను కొత్త కథలతో ఎలా అలరించాలో ఆలోచించాలని అన్నారు. మనకంటూ గుర్తింపు వచ్చిన తర్వాత, ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా ఇక్కడి దాకా వచ్చానని చెప్పడం కంటే ప్రేక్షకుల వల్లే ఈ స్థాయిలో ఉన్నానని చెప్పాలని అభిప్రాయపడ్డారు. ఎందుకంటే బ్యాక్‌గ్రౌండ్ ఉన్న వారికి ఒత్తిడి, ఇబ్బందులు ఉంటాయని, లేని వారికి అలాంటివేమీ ఉండవని గుర్తు చేశారు. పరిశ్రమకు రాగానే ఒకేసారి పెద్ద హీరో అయిపోవాలని అనుకోకూడదని అన్నారు. మనతో సినిమా తీస్తే మినిమం గ్యారెంటీ ఉంటుందనుకునేలా మనం నిరూపించుకోవాలని అన్నారు. అవకాశాలు వచ్చే వరకూ పరిశ్రమలో పని చేస్తుండాలని అన్నారు. నటుడు రవితేజ పది సినిమాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశారని గుర్తు చేశారు. అంత కష్టపడ్డారు కాబట్టే ఈ రోజు ఆ స్థాయికి ఎదిగారని అన్నారు. తాను చేసిన సినిమాల్లో ఏది ఇష్టమంటే చెప్పలేని పరిస్థితి అని తెలిపారు. 'హనుమాన్' వచ్చినప్పుడు బాగా చేశాననిపించిందని 'మిరాయ్' వచ్చాక అంతకంటే బాగా చేశానని అనిపించిందని తెలిపారు.

# ఈ వారం విడుదలైన సినిమాల రేటింగ్స్

**ముందు వరుసలో నిలిచిన 'ఛాంపియన్'**

**ఆడియన్స్ ను మెప్పించిన 'శంబాల' - 'ఈషా'**

**విలేజ్ నేపథ్యంతో ఆకట్టుకున్న 'దండోరా'**



ఈ ఏడాదిలో పెద్ద సినిమాల జోరు తక్కువేనని చెప్పాలి. థియేటర్ల దగ్గర చిన్న సినిమాల సందడి ఎక్కువగా కనిపిస్తూ వచ్చింది. ఏడాది చివరికి చేరుకుంటూ ఉండగా, ఈ వారంలో కూడా థియేటర్ల దగ్గర చిన్న సినిమాల హడావిడినే కనిపించింది. ఆ సినిమాల జాబితాలో ఛాంపియన్ .. శంబాల .. దండోరా .. ఈషా వంటి సినిమాలు ఉన్నాయి. ఈ మూడింటిలో కాస్త ఎక్కువ బడ్జెట్ లో రూపొందిన సినిమాగా 'ఛాంపియన్' కనిపిస్తుంది. రోషన్ - అనశ్వర రాజన్ జంటగా నటించిన సినిమా ఇది. స్వప్న సినిమా బ్యానర్ పై నిర్మితమైన ఈ సినిమాకి, ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహించాడు. రోషన్ - అనశ్వర జోడీగా కొత్తగా అనిపించడం .. రెండు పాటలు జనంలోకి వెళ్లడం వలన ఈ సినిమాపై బజ్ ఏర్పడింది. రజాకార్ల కాలంలో నడిచే ఈ కథకి, చాలా సైట్లు 2.5 నుంచి 3 వరకూ రేటింగ్ ఇచ్చాయి. ఆ తరువాత స్థానంలో నిలిచిన సినిమాగా 'శంబాల' కనిపిస్తుంది. ఆది సాయికుమార్ .. అర్చన అయ్యర్ .. శ్వాసిక విజయ్ ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సినిమాకి చాలా సైట్లు 2.5 రేటింగును ఇచ్చాయి. ఇక పెద్దగా పబ్లిసిటీ లేకపోయినా 'ఈషా' కూడా థియేటర్ల దగ్గర సందడి చేసింది. హారర్ థ్రిల్లర్ కంటెంట్ పట్ల ఆసక్తిని చూపించిన ప్రేక్షకుల సంఖ్య ఎక్కువగానే కనిపించింది. హెబ్బా పటేల్ - అఖిల్ రాజ్ ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సినిమా కూడా ఎక్కువ సైట్ల నుంచి 2.5 రేటింగ్ నే తెచ్చుకుంది. శివాజీ - నవదీప్ నటించిన 'దండోరా' కూడా ఎక్కువగా 2.5 .. 2.75 రేటింగ్ నే నమోదు చేసింది. విలేజ్ నేపథ్యంతో కూడిన ఈ సినిమా, ఎమోషన్స్ వైపు నుంచి ఎక్కువగా కనెక్ట్ అయింది.